
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శుక్రవారం 19 సెప్టెంబరు 2025 | 5



సత్యదేవుని సన్నిధిలో దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధం

- 11 రోజులు వివిధ రూపాల్లో అమ్మవారి అలంకరణలు
- రూ 2.75 లక్షలు విలువైన పట్టు వస్త్రాలు అందజేసిన దాత

6

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వీఆర్వోలకు ఉద్యోగోన్నతి కల్పించాలని కలెక్టర్‌కు వినతి 7

అన్నవరంలో .. హిజ్రాలకు కౌన్సిలింగ్ 7

జంట హత్యలపై విచారణ 7

అక్టోబరు 1న ఆటో వాహనదారులకు రూ.15వేలు

- దరఖాస్తుకు నేడే ఆఖరితేదీ
- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న ఆటో, మోటారు క్యాబ్, మాక్సీక్యాబ్ వాహనదారులకు వాహన మిత్ర పథకం ద్వారా రూ.15వేలు ఆర్థికసాయం అక్టోబరు 1న అందిస్తామని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. ఈ పథకం ద్వారా వాహనదారుల బ్యాంకు ఖాతాలోకి నేరుగా నగదు జమ అవుతుందన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు శుక్రవారం సాయంత్రంలోగా సచివాలయంలో దరఖాస్తుచేసుకోవాలన్నారు.కొత్త దరఖాస్తులను ఈనెల 22న మండలస్థాయిలో, 24న జిల్లాస్థాయిలో పరిశీలన చేసి అర్హత కలిగిన లబ్ధిదారులకు 1న సొమ్ములు జమచేస్తామన్నారు. వాహనదారులు వేరేవారికి అమ్మిన వాహనం బదిలీ చేసుకోని వారికీ, కొత్తగా వాహనం కొని రిజిస్ట్రేషన్ చేసుకోనివారికి రెండో విడత ఆర్థికసాయం అందించడానికి దరఖాస్తులను పరిశీలిస్తామన్నారు. ఈపథకం ద్వారా వాహనదారుల ఆర్థికస్థితిని బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు.

స్వచ్ఛంద రక్తదానంపై అవగాహనకు ప్రచార వాహనం ప్రారంభం

జీజీహెచ్(కాకినాడ), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): యువతలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్ వ్యాధి నివారణ, స్వచ్ఛంద రక్తదానంపై అవగాహన పెంచేందుకు సంచార సమాచార ప్రచార వాహనాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహ నాయక్ గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఈకార్యక్రమం డీఎల్‌టీవో డాక్టర్ ఎస్.చలమయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా యువత హెచ్‌ఐవీ/ఎయిడ్స్ వ్యాధిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కాకినాడ జిల్లాను హెచ్‌ఐవీ రహితంగా చేసేందుకు ప్రజలు ముందుకురావాలని కోరారు. ఈ సంచార సమాచార వాహనంలో ప్రదర్శించే వీడియోలు అక్షరాస్యత లేనివారికి కూడా అర్థమ య్యేలా ఉన్నాయన్నారు. జన సమూహాలు, కళాశాలల వద్ద వీటిని ప్రదర్శిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజ్మెంట్ ఆఫీసర్ డాక్టర్ జి.లక్ష్మి, డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు, పి.బాలాజి, ఎ.బుజ్జిబాబు, రామానాయుడు, ఎంవీ రత్నరాజు, డాక్టర్ రత్నమణి పాల్గొన్నారు.



ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్

యూరియాపై విజిలెన్స్!





గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో రోడ్డు పక్కనే లారీ ఆపి యూరియా బస్తాలను ఆటోలో ఎక్కిస్తున్న దృశ్యం

యూరియా అక్రమ దందాకు అడ్డుకట్ట

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

యూరియాపై భిన్నవాదనలు.. అధికారులు కొరత లేదంటున్నారు.. రైతులు కొరత అంటూ ఆందోళన చెందుతున్నారు. అవసరానికి సరిపడా పంపిస్తున్నామని ప్రభుత్వం గణాంకాలతో సహా చెబుతోంది. అయితే రైతులు మాత్రం అడపాదడపా ఇబ్బందులు పడుతూనే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలతో విజిలెన్స్ రంగంలోకి దిగింది. యూరియా పంపిణీ చేస్తున్న ఆర్ఎస్‌కే, సొసైటీలు, ఎరువుల షాపులపై నిఘాపెట్టింది. కొరత లేనప్పటికీ సమస్య ఎక్కడ ఉత్పన్నమవుతుందనే విషయాన్ని నిగ్గు తేల్చే పనిలో నిమగ్నమైంది. గత నెల 23న విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. సొసైటీలు, రైతు సేవా కేంద్రాలు, రిటైల్ షాపుల్లో మూడు జిల్లాల్లో మూడు ప్రత్యేక బృందాలు నిరంతరం సంచరిస్తూ తనిఖీలు చేస్తున్నాయి. రికార్డులు సరిగా లేకపోయినా, నిల్వ, అమ్మకానికి పొంతన కుదరకపోయినా కేసులు నమోదు చేస్తున్నారు. ఈనెల 18వ తేదీ వరకూ 99 తనిఖీలు చేసి 6(ఏ) కేసులు 16 నమోదు చేశారు. మూడు జిల్లాల్లో రూ.99.59 లక్షలు విలువైన 318 టన్నుల ఎరువులు సీజ్ చేశారు. వీటిలో 130 టన్నుల యూరియా ఉంది. రికార్డులు సక్రమంగా లేని 31 కేసుల్లో రూ.2 కోట్ల విలువైన 722 టన్నుల యూరియా విక్రయాలు నిలుపుదల చేశారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలంలో తాజాగా విజిలెన్స్, వ్యవసాయాధికారుల తనిఖీల్లో రెండు లారీల్లో అక్రమంగా తెచ్చిన 548 బస్తాల యూరియా స్వాధీనం చేసుకోవడంతోపాటు బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

సీజ్ చేస్తున్నారు.. తరలించేస్తున్నారు!

గతంలో సీజ్ చేసిన ఎరువులను కేసు పరిష్కారం కాబడే వరకూ రిలీజ్ చేయడం జరిగేది కాదు. దీంతో నెలల తరబడి ఎరువులు గోదాముల్లో ఉండేవి. ఇప్పుడు యూరియా సీజ్ చేస్తే 24 గంటల్లో అవసరం ఉన్న చోటికి తరలిస్తున్నారు.

- మూడు జిల్లాలకు 3 టీమ్‌లు ఏర్పాటు
- 99 చోట్ల తనిఖీలు.. 16 కేసులు నమోదు
- రూ.99.59 లక్షల విలువైన ఎరువులు సీజ్
- గొల్లప్రోలు మండలం 548 బస్తాలు పట్టివేత



గొల్లప్రోలు మండలంలో సీజ్ చేసిన రెండు లారీలు

సమస్య ఉంటే డయల్ 80082 03262



యూరియా సరఫరాపై అప్రమత్తంగా ఉన్నాం. విజిలెన్స్ శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేసి అక్రమాలపై కేసులు పెడుతున్నాం. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువకు విక్రయించడం తదితర అక్రమాలపై సమాచారం ఉంటే వెంటనే 80082 03262 నెంబరుకు సమాచారం ఇవ్వాలి.

- స్నేహిత, విజిలెన్స్ అధికారి, ఉమ్మడి తూర్పుగోదావరి

అక్రమ దందా..అడ్డంగా చిక్కారు!

- అక్రమ మార్గాల్లో యూరియా
- బ్లాక్‌మార్కెట్‌లో బస్తా రూ.400
- నలుగురిపై కేసు..అరెస్టు

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): యూరియాపై ప్రభుత్వం, అధికారులు ఎంత నిఘా ఉంచినా అక్రమ మార్గాల్లో తరలిపోతోంది. ఇతర ప్రాంతాల నుంచి యూరియాను లారీల్లో తెచ్చి బ్లాక్‌మార్కెట్‌కు తరలించి బస్తాపై అదనంగా రూ.400-500 వరకూ సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు ఎరువుల డీలర్లు గ్రామాల్లోకి నేరుగా లారీలు తెచ్చి విక్రయాలు సాగిస్తున్నారు.గొల్లప్రోలు మండలం తాటిపర్తి, వన్నెపూడి గ్రామాల్లో యూరియా అధిక ధరలకు విక్రయిస్తున్నారని, షాపులకు రావాల్సిన నిల్వలు పక్కదోవ పట్టిస్తున్నారని అందిన ఫిర్యాదులపై విజిలెన్స్ సీఐ ఐ.గోపాలకృష్ణ, వ్యవసాయశాఖ ఏడీ పి.స్వాతి, గొల్లప్రోలు మండల వ్యవసాయాధికారి కేవీవీ సత్యనారాయణ తనిఖీలు చేపట్టారు. తాటిపర్తి గ్రామ శివారులో వన్నెపూడి రోడ్డులో యూరియా లోడుతో రెండు లారీలను గుర్తించి విచారణ చేపట్టారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడి రైల్వే ర్యాక్ నుంచి 450 బస్తాల ఎన్ఎఫ్ఎల్ యూరియా తాటిపర్తి నాగదుర్గా ఏజన్సీస్‌కు లారీలో తెచ్చారు. అయితే షాపు నిర్వాహకుడు సదరు లారీని షాపు వద్దకు రానివ్వకుండా వేరే ప్రాంతంలో నిలపమని చెప్పి ఆటోలు, మోటార్ సైకిళ్ల ద్వారా 127 బస్తాల యూరియా తరలించినట్టు లారీ డ్రైవర్ తెలిపారు. మరో లారీలో 450 బస్తాల యూరియాను ద్వారపూడి రైల్వే వేగన్ నుంచి తాటిపర్తిలోనే నాగదుర్గా ఏజన్సీస్‌తోపాటు దుర్గా సరస్వతి ట్రేడర్స్‌కు తీసుకువచ్చారు. ఇందులో 225 బస్తాల వంతున రెండు షాపులకు తీసుకోవాలని చెప్పారని లారీ డ్రైవర్ తెలిపారు. నాగదుర్గా ఏజన్సీస్‌కు వచ్చిన స్టాకును వన్నెపూడిలో రోడ్డుపై నిలిపి రూ.400 వంతున విక్రయించినట్టు అధికారుల విచారణలో వెల్లడైంది. తాటిపర్తి డీలర్లకు ఈ స్టాకు హోల్‌సేల్ డీలర్లుగా ఉన్న సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం లక్ష్మీ కల్యాణి ఎంటర్‌ప్రైజెస్, ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ ఏజన్సీస్ నుంచి పంపినట్టు గుర్తించారు. యూరియా అక్రమ రవాణా, బ్లాక్ మార్కెట్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు గుర్తించి రెండు లారీలతోపాటు 548 బస్తాల యూరియా స్వాధీనం చేసుకున్నారు. వీరు తనిఖీలు చేస్తున్న సమయంలోనే ఈ పోస్ మిషన్ ద్వారా నాగదుర్గా ఏజన్సీస్ ప్రతినిధి రైతుల వేలి ముద్రలు తీసుకునేందుకు ప్రయత్నిస్తుండగా సదరు మిషన్‌ను సైతం సీజ్ చేశారు. వీటిని గొల్లప్రోలు పోలీసులకు అప్పగించారు. విజిలెన్స్, వ్యవసాయాధికారుల తనిఖీలు గురువారం తెల్లవారుజామున నాలుగు గంటల వరకూ కొనసాగాయి.

నలుగురి అరెస్టు

యూరియా అక్రమ రవాణా, బ్లాక్ మార్కెట్ చేసి అధిక ధరలకు విక్రయించడం, ఈపోస్ యంత్రాలను దుర్వినియోగం చేసి రైతుల వేలి ముద్రలు సేకరించి తప్పుడు రికార్డులు సృష్టించేందుకు ప్రయత్నించడం తదితర అంశాలపై ఏవో సత్యనారాయణ ఫిర్యాదు మేరకు రెండు కేసులు రిజిస్టర్ చేశామని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ తెలిపారు. తాటిపర్తి నాగదుర్గా ఏజన్సీస్ నిర్వాహకుడు దాసం శ్రీనివాస్, హెల్పర్ కర్రెడ్ల కనక వీర బాబు, మండపేట మండలం ద్వారపూడికి చెందిన డ్రైవర్లు కొటారి వీరబాబు, గుత్తుల దుర్గారావులపై కేసు నమోదు చేశామని, వీరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

బుధవారం లైసెన్స్ రద్దు చేసినా..

తాటిపర్తిలోని నాగదుర్గా ఏజన్సీస్‌కు 30 టన్నుల యూరియా రాగా, దానిని అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు రైతుల నుంచి ఫిర్యాదులు అందాయి. దీంతో వ్యవసాయాధికారి సత్యనారాయణ బుధవారం తనిఖీలు చేసి దగ్గరుండి ఎమ్మార్పీ ధరలకు విక్రయించడంతోపాటు లైసెన్స్ రద్దు చేశారు. అయినా లెక్క చేయకుండా యూరియా బ్లాక్‌మార్కెట్‌కు తరలించడం గమనార్హం.

మరో నాలుగు బార్లకు లాటరీ ద్వారా ఎంపిక

- ఎనిమిది బార్లకు దరఖాస్తులు నిల్
- వీటికి రీనోటిఫికేషన్ ఇచ్చే అవకాశం

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లాలో మిగిలిపోయిన 12బార్లకు సంబంధించి లాటరీ ద్వారా దరఖాస్తుదారుల ఎంపిక గురువారం జరిగింది. జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారిణి కృష్ణకుమారి ఆధ్వర్యంలో లాటరీ ద్వారా నాలుగు బార్లకు దరఖాస్తుదారులను ఎంపిక చేశారు. దీనిలో మూడు బార్లు జనరల్ కేటగిరీలో కాకినాడ నగరంలో ఏర్పాటు కానున్నాయి. గీత కులాలకు చెందిన రిజర్వ్‌డ్ కేటగిరీలో ఒక బార్‌ను గొల్లప్రోలు నగర పంచాయతీలో దరఖాస్తుదారుడు దక్కించుకున్నారు. మిగిలిన 8 బార్లకు దరఖాస్తులు రాకపోవడంతో మరో నాలుగురోజుల్లో రీనోటిఫికేషన్ ఇచ్చి మరోసారి దరఖాస్తులను ఆహ్వానిస్తారు. జిల్లాలో మొత్తంగా 17 బార్లకు దరఖాస్తులు ఆహ్వానించగా తొలిసారి నిర్వహించిన లాటరీ విధానంలో ఐదు బార్లకే అనుమతులు ఇచ్చారు. ఆశించినస్థాయిలో దరఖాస్తులు రాకపోవడంవల్ల అప్పట్లో 12 ఖాళీగానే ఉండిపోయాయి. ఇప్పుడు రెండోసారి ఆ 12 బార్లలో 4బార్లకే దరఖాస్తులు రావడంతో వాటిని లాటరీలో ఎంపిక చేశారు. ఇంకా 8బార్లను ఎప్పుడు భర్తీ చేస్తారో అధికారులకు తెలియడం లేదు. దరఖాస్తుదారుల నుంచి స్పందన లేకపోవడంవల్ల బార్ల కోసం పలుమార్లు గెజిట్ నోటిఫికేషన్ ఇస్తూనే ఉన్నారు. మరో నాలుగు రోజుల్లో మూడుసార్లు 8బార్లకోసం గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వాల్సి వచ్చింది.

ఎరువుల అక్రమ నిల్వలపై దాడులు

- ఇప్పటివరకు 260 మెట్రిక్ టన్నుల ఎరువుల స్వాధీనం
- పది దుకాణాలపై 6ఏ కేసులు నమోదు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎరువుల అక్రమ నిల్వలపై దాడులు కొనసాగుతున్నాయి. నెలరోజులుగా వ్యవసాయశాఖ, విజిలెన్స్ అధికారుల బృందాలు విస్తృతంగా దాడులు చేశారు. నిబంధనలను ఉల్లఘించిన దుకాణాలపై కేసులు నమోదు చేస్తున్నారు. ఇప్పటివరకు పది ప్రైవేటు ఎరువుల దుకాణాలపై 6ఏ కేసులు నమోదు చేశారు. 260 మెట్రిక్‌టన్నుల ఎరువులను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.51.45లక్షలుగా గుర్తించారు. యూరియా రవాణా, అక్రమ నిల్వలపై ఎక్కువగా నిఘాపెట్టారు. తాజాగా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో శ్రీనాగ దుర్గ ఏజెన్సీస్ ఎరువుల దుకాణంపై అధికారులు దాడులు చేశారు. యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించి లైసెన్సు రద్దు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎరువుల దుకాణదారులు అప్రమత్తమయ్యారు. ఎరువుల స్టాక్ నిల్వలను సరిచూసుకుంటున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్ ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రైవేటు ఎరువుల దుకాణదారులు నిబంధనల ప్రకారం ఎరువులను విక్రయించాలన్నారు. ఎక్కడైనా ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు యూరియా విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. అక్రమంగా నిల్వ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. జిల్లా లో విజిలెన్స్ బృందాలు దాడులు మరిన్ని రోజులు కొనసాగుతాయన్నారు. జిల్లాలో యూరియా అధిక ధరలకు విక్రయిస్తే తమకు ఫిర్యాదు చేయాలన్నారు.

ప్రతి గ్రామాన్ని పిల్లల స్నేహపూరితంగా తీర్చిదిద్దాలి

- మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐసీడీఎస్ పీడీ, ఇతర అధికారులు

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి గ్రామాన్ని పిల్లల స్నేహపూరిత గ్రామంగా తీర్చిదిద్దాలని, ప్రతి గ్రామంలో మొదటి, మూడో శుక్రవారం గ్రామ బాలల సంక్షేమ, పరిరక్షణ కమిటీ మీటింగ్స్ జరగాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మి అన్నారు. ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్ లక్ష్మి ఆధ్వర్యంలో గురువారం బాలల సంక్షేమ, బాలల పరిరక్షణ కమిటీ పోస్టర్స్, రిజిస్టర్స్‌ను ఆవిష్కరించారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని పిల్లల స్నేహపూరిత గ్రామంగా తీర్చిదిద్దాలని దానికోసం ప్రతినెల మొదటి శుక్రవారం, మూడో శుక్రవారం గ్రామబాలల సంక్షేమ, పరిరక్షణ కమిటీ మీటింగ్స్ ప్రతి గ్రామంలో జరగాలని సూచించారు. బాల్యవివాహాలు, బాలకార్మికులు, బాలికలపై వేధింపులు లేకుండా ఉండే సమాజంగా జిల్లాను తయారు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీపీవో సీహెచ్ వెంకట్రావు, పీవోఐసీ శ్రీనివాస్, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్(క్రాఫ్) డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ బి.కుమార్ పాల్గొన్నారు.

మ్యాజిక్ డ్రైన్ నిర్మాణానికి పైలెట్ ప్రాజెక్టుగా గోవిందపురం

- డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి

జగ్గంపేటరూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి):జగ్గంపేట మండలంలోని గోవిందపురం మ్యాజిక్‌డ్రైన్ నిర్మాణానికి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైనట్లు డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి తెలిపారు. మండల అధికారులు, సిబ్బందితో కలిసి గ్రామంలోని డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ జిల్లాలో నాలుగు గ్రామాలను ఎంపిక చేసి మ్యాజిక్ డ్రైనేజీలను నిర్మించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. గ్రామంలోని గిరిజన కాలనీలో ఐదు కిలోమీటర్ల పరిధిలో రూ.38లక్షలతో కాలనీ అంతా మ్యాజిక్ డ్రైన్‌లు నిర్మించినట్లు తెలిపారు. మూడువేల మీటర్ల పరిధిలో మ్యాజిక్‌డ్రైన్ నిర్మిస్తామన్నారు. సాధారణ డ్రైనేజీ నిర్మాణానికి వంద మీటర్ల పొడవుకు రూ.5లక్షల వరకు ఖర్చు అవుతుంటే, మ్యాజిక్ డ్రైనేజీ నిర్మాణానికి రూ.లక్ష కంటే తక్కువ ఖర్చవుతుందని వివరించారు. ఈ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణంతో గ్రామాల్లో దోమల బెడద తగ్గుతుందన్నారు. నివాస గృహాల్లో వాడిన నీటితోపాటు వర్షపునీరు ఈ మ్యాజిక్ డ్రైన్ ద్వారా మళ్లీ భూమిలోకి ఇంకింపజేసి నీటిని ఉత్పత్తి చేసేందుకు దోహదపడుతుందన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా పెద్దాపురం పట్టణంలో ఈమ్యాజిక్‌డ్రైన్ నిర్మాణాన్ని దాని ఆవశ్యకతను సీఎం దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు.త్వరలో ప్రతి గ్రామంలో ఈ విధానంలోనే డ్రైనేజీలు నిర్మిస్తామన్నారు. కాకినాడ రోడ్డులోని గ్రామ శివారు కోనేటి వద్ద చేపట్టిన పార్కు నిర్మాణ పనులను అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు.

ఖరీఫ్ ధాన్యం సేకరణకు కార్యాచరణ సిద్ధం!

- జిల్లాలో 269 ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- 3లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం
- వచ్చేనెల మూడోవారంలో కేంద్రాలు ప్రారంభానికి సన్నాహాలు
- 23న కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి శిక్షణా తరగతులు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరించడానికి అధికార యంత్రాంగం కార్యాచరణ సిద్ధం చేసింది. గతేడాదికంటే అధికంగా ధాన్యం సేకరించి రైతులను ఆదుకోవాలని సంకల్పించారు. ధాన్యం సేకరణపై జిల్లాస్థాయిలో ఉద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

కాకినాడ జిల్లాలో 2025-26 ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణకు సివిల్ సప్లయిస్ అధికారులు సర్వం సిద్ధంచేశారు. జిల్లావ్యాప్తంగా 269 ధాన్యం కొనుగోలు కేంద్రాలు(రైతు సేవా కేంద్రాలు) ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.ధాన్యం సేకరణకు కావాల్సిన అన్ని సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో 6లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించారు. దీనికోసం 1900 వాహనాలు, 62లక్షల గోనెసంచులు సిద్ధం చేశారు. పదిరోజులుగా మండలస్థాయిలో రైతు సేవాకేంద్రాల్లో ఉన్న టీఏలు, డీఏలు, హెల్పర్లకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. ధాన్యం సేకరణ సమయంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో అధికారులు వివరిస్తున్నారు. ధాన్యం సేకరించిన తర్వాత జిల్లాలో 117రైస్‌మిల్లులకు వీటిని సీఎంఆర్‌కోసం తరలిస్తారు. రూ.200కోట్లు బ్యాంకు గ్యారెంటీలు తీసుకోవాలని అధికారులు ప్రాథమికంగా ఒక నిర్ణయానికి వచ్చారు. గతేడాది ఖరీఫ్‌లో 1.60లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. రూ.150కోట్లు బ్యాంకు గ్యారెంటీలను మిల్లర్లనుంచి తీసుకున్నారు. ఈ ఏడాది ఎక్కువమొత్తంలో ధాన్యం సేకరించడానికి సన్నాహాలు చేయడంతో బ్యాంకు గ్యారెంటీలు కూడా పెరుగుతున్నాయి. గత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణపై ఐవీఆర్ఎస్ ప్రోగ్రాస్‌ను పరిశీలిస్తే కేవలం ఒకశాతం మాత్రమే ఫిర్యాదులు వచ్చాయి. ఈనేపథ్యంలో ఈ ఏడాది కూడా సాఫీగా ధాన్యం సేకరణ జరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

పెద్ద ఎత్తున ధాన్యం సేకరణకు సన్నద్ధం

పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ దేవుల నాయక్

ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి పెద్ద ఎత్తున ధాన్యం సేకరణ చేసేందుకు సన్నద్ధంగా ఉన్నాం. అక్టోబరు మూడో వారంలో కేంద్రాలు ప్రారంభిస్తాం.ఈనేపథ్యంలో జిల్లాలో ధాన్యం సేకరణలో పాల్గొనే ఉద్యోగులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నాం. జిల్లాస్థాయిలో కాకినాడ కలెక్టరేట్‌లో శిక్షణా తరగతులు జరుగుతాయి. కాకినాడ రెవెన్యూ డివిజన్, పెద్దాపురం రెవెన్యూ డివిజన్లు వరుస రోజుల్లో శిక్షణా తరగతులు జరుగుతాయి. ఈ తరగతుల్లో ధాన్యం సేకరణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన విధివిధానాలపై ప్రత్యేకంగా నిపుణులు వివరిస్తారు. రైతులకు 48 గంటల్లోనే ధాన్యం సొమ్ములు జమయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

2వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్

గత రబీసీజన్‌లో మిల్లర్లకు ఇచ్చిన ధాన్యంలో 2వేల మెట్రిక్ టన్నుల వరకు బియ్యం సీఎంఆర్ పూర్తి చేసి పౌరసరఫరాల సంస్థకు పంపాల్సి ఉంది. జిల్లాలో ఇంకా ఆరు రైస్‌మిల్లులు నుంచి ఈ బియ్యం మిల్లింగ్ చేసి ఇవ్వాల్సిఉంది. ఈ నేపథ్యంలో త్వరితగతిన బియ్యాన్ని పంపాలని సివిల్ సప్లయిస్‌అధికారులు కోరుతున్నారు.

సాగునీటి చెరువుల అభివృద్ధికి చర్యలు

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి చెరువుల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్ మోహన్ అధికారులను ఆదేశించారు. సాగునీటి చెరువుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన మరమ్మతులు, ఆధునికీకరణ, నీటి నిల్వల సామర్థ్యం పెంచడం వంటి పనులపై గురువారం ఆయన కాకినాడ కలెక్టరేట్‌లో ఇరిగేషన్, ప్రణాళికశాఖ, వ్యవసాయం, బీసీ కార్పొరేషన్, పిఠాపురం ప్రాంతఅభివృద్ధి ప్రాధికార సంస్థ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ జలాల శాతాన్ని పెంచడం, ఆయకట్టు స్థిరీకరణ, ఆయకట్టును పెంచడం ద్వారా సమగ్రాభివృద్ధి సాధించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగు నీటి చెరువుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. ఈపథకం ద్వారా సాగునీటి చెరువులకు మరమ్మతులు, ఆధునికీకరణ, నీటి నిల్వల సామర్థ్యం పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ పథకంలో భాగంగా జిల్లాలో తొలి దశ కింద 50 సాగునీటి చెరువులను గుర్తించి వీటికి సంబంధించిన సమగ్ర వివరాలను సేకరించేందుకు ఇరిగేషన్, వ్యవసాయం, ప్రణాళిక, సర్వే ఇతర శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. సాగునీటి చెరువుల సమగ్ర వివరాలతో కూడిన నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో సీపీవో త్రినాథ్, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, ఎస్ఎస్ఏ ఏపీవో, ఇన్‌చార్జి పాడా పీడీ వేణుగోపాల్‌రావు, సర్వేశాఖ ఏడీ శ్రీనివాసు, ఇరిగేషన్ డీఈలు రవికుమార్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ఉద్యోగుల పీజీఆర్ఎస్

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సూచనల ప్రకారం ప్రతినెల మూడో శుక్రవారం ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో ప్రభుత్వ ఉద్యోగుల పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. శుక్రవారం సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు కలెక్టరేట్‌లో ఉద్యోగుల సమస్యలపై అర్జీలను స్వీకరిస్తామన్నారు.

జిల్లాలో రేపు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర

- 'గ్రీన్ ఏపీ అటవీకరణ ద్వారా పచ్చదనాన్ని ప్రోత్సహించండి' థీమ్‌తో కార్యక్రమం

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఈనెల 20న జిల్లాలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కింద స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం 'గ్రీన్ ఏపీ అటవీకరణ ద్వారా పచ్చదనాన్ని ప్రోత్సహించండి' అనే థీమ్‌తో నిర్వహించాలని ఆదేశించిందన్నారు. ఈ కార్యక్రమం వివరాలను ప్రజలకు తెలిసేలా టాంటాం వేయించాలన్నారు. ప్రకటనలు చేయించి శనివారం జరిగే కార్యక్రమాల ప్రదేశాలను వివరించాలన్నారు. సాధారణ ప్రజలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల భాగస్వామ్యంతో చేయాలన్నారు. ఐఈసీ యాక్టివిటీలను మండల, గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టాలన్నారు. ఒక ప్రణాళిక ప్రకారం స్వచ్ఛ దివాస్ నిర్వహించాలన్నారు.

ఆర్థిక సాయం పొందాలంటే..



- ఆటో కార్మికులు ఈ నిబంధనలు పాటించాల్సిందే
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు నేటితో గడువు ముగింపు
- రవాణా శాఖకు 24న అందనున్న తుది జాబితా
- అక్టోబరు 1న బ్యాంకు ఖాతాలకు చేరనున్న ఆర్థిక సాయం
- సచివాలయాలకు క్యూలు కడుతున్న ఆటో, మ్యాక్సీ, క్యాబ్ కార్మికులు

– అమలాపురం, సామర్లకోట/ఆంధ్రజ్యోతి

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆటో కార్మికుల కుటుంబాలకు విజయదశమి పర్వదినం రోజైన అక్టోబరు 2 నుంచి అందించనున్న ఆర్థిక సహాయం కోసం అర్హులైన ఆటో కార్మికులు దరఖాస్తులు చేసుకునేందుకు సచివాలయాల వద్ద క్యూలు కడుతున్నారు. రాష్ట్రంలో స్త్రీశక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు సదుపాయాన్ని గత నెల 15వ తేదీ నుంచి అమలులోకి తీసుకురావడంతో ఆటో కార్మికుల జీవనోపాధిపై ప్రభావం తీవ్రంగా పడింది. దీని ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆటో కార్మికులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేపడుతున్న నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం ఇటీవల అనంతపురంలో జరిగిన సూపర్-6 సక్సెస్ సభలో ఆటో కార్మికుల కుటుంబానికి ఏడాదికి ఒక్కో కుటుంబానికి రూ.15వేల వంతున ఆర్థిక సహాయాన్ని అక్టోబరు 2 నుంచి అందజేస్తారని ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో రోడ్లు, ట్రాన్స్‌పోర్టు శాఖ ఇటీవల కొన్ని మార్గదర్శకాలతో ఉత్తర్వులు జారీ చేసింది. జీవో ఎంఎస్ నంబరు 33లో ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర సౌకర్యాన్ని కల్పించేందుకు విధివిధానాలను రూపకల్పనచేసి ఉత్తర్వులు విడుదల చేసింది. ముఖ్యంగా ఆటోరిక్షా, మోటారు క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ఈ పథకం కింద ప్రభుత్వం రూ.15 వేలు వంతున ఆర్థిక సహాయం అందజేయనుంది. ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సహాయంతో ఆటోలకు బీమా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ మరమ్మతులు, ఇతర అవసరాల కోసం ఈ సహాయం అందే

నిబంధనలు ఇలా..

- జిల్లావ్యాప్తంగా బుధవారం నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. గ్రామ వార్డు సచివాలయాల ద్వారా ఈ దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.
- ఈ పథకం కింద అర్హత పొందేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ పొందిన ఆటో, క్యాబ్, మ్యాక్సీ క్యాబ్‌లకు అర్హత ఉంటుంది. డ్రైవింగ్ లైసెన్సులు కూడా ఉండాలి.
-ఏపీలో జారీచేసిన ఆటోరిక్షా లైట్ మోటారు వాహనాన్ని నడపడానికి చెల్లుబాటయ్యే లైసెన్సు ఖచ్చితంగా ఉండాలి. ఏపీలో రిజిస్టర్ అయిన వాహనం అయి ఉండాలి. మోటారు క్యాబ్, మ్యాక్సీ క్యాబ్‌ల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఖచ్చితంగా ఉండాలి. ఆటో రిక్షా విషయంలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోయినా, 2025-26 సంవత్సరానికి అనుమతిస్తారు. ఒక నెలలోపు ఆ సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుంది.
- ప్యాసింజర్ ఆటో రిక్షా, మోటారు క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ యజమానులకు వర్తిస్తుంది. బీపీఎల్‌కు దిగువన ఉండాలి. ఖచ్చితంగా రేషన్‌కార్డు కలిగి ఉండాలి.
- దరఖాస్తుదారు లేదా కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఉద్యోగి లేదా పెన్షనర్‌గా ఉంటే అనర్హులు. పారిశుధ్య కార్మికులకు మినహాయింపు ఉంటుంది.
- ఇంటి విద్యుత్ వినియోగం నెలకు 300 యూనిట్ల కంటే తక్కువగా ఉండాలి.
- దరఖాస్తు తేదీకి ముందు 12 నెలలు సగటున లెక్కిస్తారు.
- సదరు వాహనంపై ఎలాంటి పెండింగ్ బకాయిలు, చలానాలు ఉండకూడదు.
- ఆటో కార్మికుడు మాగాణి అయితే మూడు ఎకరాలు, మెట్ట అయితే పది ఎకరాల్లోపు ఉండాలి.
- పట్టణ ప్రాంతాల్లో వెయ్యి చదరపు అడుగులకంటే ఎక్కువ నివాసం, వాణిజ్య భవనాలు ఉండకూడదు.
- కొత్త దరఖాస్తులు స్వీకరణ.. ఈనెల 15 నాటికి వాహనాల జాబితా, రిజిస్ట్రేషన్ నంబరు, యజమాని పేరు, చిరునామా, ఫోన్ నంబరుతో కూడిన వివరాలను ప్రభుత్వం జీఎస్‌డబ్ల్యూఎస్‌కు అందిస్తోంది.
- తాజా మార్గదర్శకాలకు అనుగుణంగా 2023-24లో ఆర్థిక సహాయం పొందిన లబ్ధిదారుల వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా విశ్లేషిస్తారు.
- కొత్త లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 19 వరకూ మాత్రమే అవకాశం ఉంది. 22 నాటికి సచివాలయం, మండల, జిల్లా స్థాయి క్షేత్ర పరిశీలన పూర్తిచేస్తారు. తుది జాబితా 24కి సిద్ధం చేస్తారు.
- లబ్ధిదారుల జాబితాను కార్పొరేషన్‌ల వారీగా జీఎస్‌డబ్ల్యూఎస్ విభాగం 24 నాటికి రవాణా శాఖకు పంపుతుంది.
- ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అక్టోబరు 1న బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారు.



వికసించిన 11 బ్రహ్మకమలాలు

అంబాజీపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అరుదుగా లభించే పుష్పాల్లో బ్రహ్మకమలాలు ఒకటి. బ్రహ్మకమలాలు వికసించిన ఆ ఇంట మంచి జరుగుతుందని ప్రజల విశ్వాసం. శివునికి అత్యంత ప్రీతికరమైన బ్రహ్మకమలాలు అంబాజీపేట వీరభద్ర థియేటర్ సమీపంలోని బిక్కిన్న వీరన్న ఇంటిలో సుమారు 11 బుధవారం అర్ధరాత్రి వికసించాయి. మంచి సువాసన కలిగిన అందంగా ఉన్న పుష్పాలు అందరినీ అబ్బురపరిచాయి.



– కాకినాడ కార్పొరేషన్/ఆంధ్రజ్యోతి



ఉచిత శిక్షణతో.. ఉపాధ్యాయ కొలువులు

- బడుగు, బలహీనవర్గాల యువతకు రాష్ట్ర ప్రభుత్వం గొప్ప అవకాశం
- సాంఘిక సంక్షేమ శాఖ ఆర్థిక సహకారంతో 260 మందికి శిక్షణ.. 60 మందికి ఉద్యోగాలు
- వీరందరికీ కాకినాడ శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ
- ఇతర సంస్థల సాయంతో ఆన్‌లైన్‌లో వేలాది మందికి శిక్షణ.. పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు

రాష్ట్రప్రభుత్వం ఈసారి మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాల నోటిఫికేషన్, ఖాళీ పోస్టుల భర్తీకే పరిమితం కాలేదు. ఉపాధ్యాయ ఉద్యోగం కోసం ఎంతో కష్టపడి చదివి, ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు అండగా నిలిచింది. ఉపాధ్యాయ పోటీ పరీక్షల్లో విజయం సాధించడానికి వీలుగా పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ ఏర్పాటుచేసింది. ఆర్థికంగా ఉన్న వారు ప్రైవేటు పోటీ పరీక్షా కేంద్రాల్లో తర్ఫీదు పొందుతున్న తరుణంలో పేద, బలహీనవర్గాల వారినీ అదే స్థాయి శిక్షణ పొందేలా ప్రైవేటు పోటీ పరీక్షా కేంద్రంలో చేర్పించి శిక్షణ ఇప్పించింది. ఆ ఫలితం ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన వారిలో స్పష్టంగా కనిపించింది. కాకినాడ విద్యుత్‌నగర్ శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో సోషల్ వెల్ఫేర్‌శాఖ ద్వారా 260 మంది ఆఫ్‌లైన్ విధానంలో హాస్టల్, భోజన,వసతితో శిక్షణ పొందారు. ఒక్కో అభ్యర్థికి ప్రభుత్వం ఫీజు కింద ఎస్‌జీటీకి రూ.10వేలు, ఎస్ఏకి రూ.12వేలు చొప్పున చెల్లించింది. స్టడీ మెటీరియల్‌కు రూ.3 వేలు, భోజన ఖర్చులు(డైట్) మూడు నెలల కాలానికి రూ.13,500 చొప్పున ఇచ్చారు. ఇక్కడ తర్ఫీదు పొందిన వారిలో 60 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికవడం విశేషం. కాపు వెల్ఫేర్ కార్పొరేషన్ ద్వారా ఆన్‌లైన్ విధానంలో శిక్షణ పొందిన 651 మందికిగాను 54 మంది, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఆర్థిక సహకారంతో ఆన్‌లైన్ విధానంలో శిక్షణ పొందిన 601మందికిగాను 45 మంది, బీసీ వెల్ఫేర్ శాఖ ద్వారా ఆన్‌లైన్ విధానంలో శిక్షణ పొందిన 4820 మందికి గాను 246 మంది అభ్యర్థులు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

ప్రభుత్వ సాయంతో శిక్షణ పొంది ఉపాధ్యాయులైన వారి మాటల్లో..

తండ్రి ఆశయం నెరవేర్చాను



నాది నిరుపేద కుటుంబం. ఆర్థిక పరిస్థితి గట్టెక్కాలంటే ఉద్యోగం సాధించడమే ఏకైక మార్గమని నా తండ్రి చెప్పేవారు. శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో డీఎస్సీ ఉచిత శిక్షణ పొందాను. ఇక్కడ ఇచ్చిన శిక్షణ, హాస్టల్, భోజన వసతులు బాగున్నాయి. రోజువారీ, వారాంతపు టెస్టులు మా విజయంలో ముఖ్య భూమిక పోషించాయి. దీంతో ఎస్టీ కేటగిరీలో స్కూల్ అసిస్టెంట్ (సోషల్) స్టేట్‌ఫస్ట్ ర్యాంకు సాధించడంతో పాటు ఎస్జీటీలో కూడా ఉద్యోగం పొంది నా తండ్రి ఆశయాన్ని నెరవేర్చాను.

- డి.బాలునాయక్, డీఎస్సీ ఎస్టీ కేటగిరీలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్, కర్నూలు జిల్లా

స్టేట్ ఫస్ట్ ర్యాంక్‌తోపాటు టీజీటీలోనూ ఉద్యోగం సాధించా



అమ్మా, నాన్న కూలి పని చేస్తారు. ఇంతవరకు వారిపైనే ఆధారపడుతూ వచ్చాను. ప్రభుత్వం కల్పించిన డీఎస్సీ ఉచిత శిక్షణ నా జీవితాన్ని మలుపు తిప్పింది. ఇక్కడ అధ్యాపకుల బోధన ఎంతో ఉపయోగపడింది. ఎస్సీ (గ్రూప్-1) కేటగిరీలో స్కూల్ అసిస్టెంట్ (సోషల్) స్టేట్ ఫస్ట్ ర్యాంకుతో పాటు టీజీటీ (సోషల్)లో కూడా ఉద్యోగం సాధించగలిగాను. **- యం.డేనియల్‌కుమార్, శ్రీకాకుళం జిల్లా**

కల నెరవేరింది



మా నాన్న వ్యవసాయ కూలీ. నేను టీచర్ ఉద్యోగం సాధించాలని కలలు కనేవాడిని. అందుకోసం బీఎస్సీ, డీఈడీ చదివాను. కుటుంబ కష్టాల కారణంగా శిక్షణ తీసుకోవడం కుదిరేదికాదు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఉచిత హాస్టల్ వసతితో కూడిన శిక్షణను సోషల్ వెల్ఫేర్ శాఖ ద్వారా ఇస్తోందని తెలుసుకుని శ్యామ్ ఇనిస్టిట్యూట్‌ను ఎంచుకున్నాను. అధ్యాపకులు నా విజయంలో కీలకపాత్ర పోషించారు. **- జి.ప్రేమ్‌కుమార్, పశ్చిమ గోదారి జిల్లా**

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



మాది బడ్డీ కొట్టు. కోచింగ్ తీసుకోవడానికి ఆర్థిక స్థోమత సరిపోలేదు. ఇటువంటి సమయంలో శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో కోచింగ్ ఇప్పించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు. మూడు నెలలపాటు తీసుకున్న శిక్షణ మా కష్టాలను తీర్చింది. ఇక్కడ పక్కా ప్రణాళికతో శిక్షణ ఇచ్చారు. మాకు చాలా అప్పులు ఉన్నాయి. టీచర్ ఉద్యోగం సాధించడం వల్ల నాకు ధైర్యంగా ఉంది. **- కె.ప్రజేష్, కృష్ణా జిల్లా**

తక్కువ సమయంలోనే సిలబస్ పూర్తి



సోషల్ వెల్ఫేర్ డిపార్ట్ మెంట్ ద్వారా అందించిన శిక్షణ చాలా ఉపయోగపడింది. అనుభవం ఉన్న ఫ్యాకల్టీతో తక్కువ సమయంలోనే సిలబస్ పూర్తి చేశారు. టెస్టులు, వాటి వివరణ హైలెట్. ఎస్టీ కేటగిరీలో ఉపాధ్యాయ ఉద్యోగం వచ్చింది.

- ఎం.శరత్‌కుమార్, పశ్చిమ గోదావరి జిల్లా

నా జీవితాన్ని మలుపు తిప్పింది



మాది నిరుపేద కుటుంబం. మా చిన్నాన్న ప్రోద్బలంతో ఉపాధ్యాయ వృత్తిలోకి రావాలనుకున్నా. సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ ద్వారా శిక్షణకు ఎంపిక కావడం నా జీవితాన్ని మలుపు తిప్పింది. అనుకున్నది సాధించాను.

- ఎన్‌పీఎస్ లక్ష్మయ్య, కర్నూలు జిల్లా

షోలాపూర్ ఉల్లికి నో ఎంట్రీ



- రాజమహేంద్రవరంలోని రైతు బజార్లలో కిలో రూ.11కు కర్నూలు ఉల్లి విక్రయాలు
- మరో వారం పరిస్థితి ఇంతే
- హోల్‌సేల్ మార్కెట్లో మహారాష్ట్ర పాయలు కిలో రూ.15-రూ.16



రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా అన్ని రైతు బజార్లలో మహారాష్ట్ర షోలాపూర్ ఉల్లిపాయల విక్రయాలు నిలిపివేశారు. వీటికి బదులుగా కర్నూలు రకం ఉల్లిపాయలను తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. కర్నూలు ప్రాంత ఉల్లి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ, వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా మార్కెటింగ్ శాఖ పర్యవేక్షణలో జిల్లాలోని రైతుబజార్ల ద్వారా వీటి విక్రయాలు చేపడుతున్నారు. కర్నూలు పాయలకు మార్కెట్ కోసం అన్ని రైతుబజార్లలో మహారాష్ట్ర ఉల్లి విక్రయాలను పూర్తిగా నిలిపివేశారు. కర్నూలు రకం ఉల్లిని రైతు బజార్లలో కిలో రూ.11కే విక్రయిస్తున్నారు. రెండు రోజుల క్రితం కిలో రూ.10కే విక్రయించారు. వాస్తవానికి జిల్లావాసులు మహారాష్ట్ర ఉల్లిపాయలనే ఎక్కువగా వినియోగిస్తారు. రేటు రూపాయి ఎక్కువైనా మహారాష్ట్ర ఉల్లినే కొంటారు. మహారాష్ట్ర ఉల్లితో పోల్చితే కర్నూలు ఉల్లి రంగు, నాణ్యతలో అంతంతమాత్రం కావడమే దీనికి కారణం. దీంతో రైతు బజార్లలో రెండు రకాలు పెడితే కర్నూలు ఉల్లికి మార్కెట్ ఉండదనే కారణంతో మార్కెటింగ్ శాఖ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. నో ప్రాఫిట్-నో లాస్ తరహాలో రైతుబజార్లలోని వ్యాపారులు ఈ ఉల్లిని విక్రయిస్తున్నారు. లాభం లేకపోవడంతో ఉల్లి వ్యాపారుల్లో కొంత అసంతృప్తి ఉన్నా అమ్మాల్సిందేనంటూ పై అధికారుల నుంచి ఒత్తిడి ఉండడంతో నోరు మెదపడం లేదు. మహారాష్ట్ర ఉల్లిపాయల ధర బహిరంగ చిల్లర మార్కెట్లలో రూ.25-30 ఉంది. తోపుడు బండ్లు, ఆటోల్లో ఇళ్లకు తీసుకొచ్చి విక్రయించేవాళ్ల మీడియం రకాలను ఆరు కిలోలు రూ.100కు ఇస్తున్నారు. కర్నూలు ఉల్లి తక్కువ ధరకే దొరికినా సాధారణ, దిగువ మధ్య తరగతి ప్రజలు ఒకటి, రెండు కిలోల కంటే ఎక్కువ కొనుగోలు చేయరని, మధ్య తరగతి, సంపన్న వర్గాలు మహారాష్ట్ర ఉల్లిపాయలనే కొంటారని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

హోల్‌సేల్‌లో మహారాష్ట్ర నెం.1 ఉల్లిపాయలు కిలో రూ.15-రూ.16

హోల్‌సేల్ మార్కెట్లో మహారాష్ట్ర నెం.1 పాయలు కిలోరూ.15, రూ.16 ఉన్నాయి. వీటిని బహిరంగ మార్కెట్లో చిల్లర వ్యాపారులు రూ.25-30 వరకు అమ్ముతున్నారు. సెకండ్, థర్డ్ క్వాలిటీ కూడా హోల్‌సేల్‌లో తక్కువ ధరకే దొరుకుతున్నాయి. కిలో రూ.12-రూ.13కే దొరుకుతున్నాయి. ఇవి పాత ఉల్లిపాయలు, ఆరుదల పాయలు కావడంతో వినియోగదారులు వీటినే ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. గోదావరి జిల్లాల్లో మహారాష్ట్ర రకం ఉల్లిపాయలకు ఎక్కువ డిమాండ్ ఉంటుంది. మహారాష్ట్రలోని షోలాపూర్, నగర్ తదితర ఐదు జిల్లాల నుంచి ఇక్కడి మార్కెట్లకు ఉల్లి వస్తుంటుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రతిరోజూ 500 టన్నుల డిమాండ్ ఉంటుందంటే మహారాష్ట్ర ఉల్లి డామినేషన్ అర్థమవుతుంది. రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లోనే దాదాపు 300 టన్నుల డిమాండ్ ఉంటుందని హోల్‌సేల్ వ్యాపారులు చెప్తున్నారు. గతంలో మాదిరిగా ప్రస్తుతం ఇతర ప్రాంతాలకు ఎగుమతులు లేవు. దీంతో మహారాష్ట్ర నుంచి నేరుగా రాజమహేంద్రవరం, జిల్లాలోని ఇతర మార్కెట్లకు వచ్చే ఉల్లిపాయలను లోకల్‌గానే వినియోగిస్తున్నారు. ఒకప్పుడు రాజమహేంద్రవరం ఉల్లిపాయల హోల్‌సేల్ మార్కెట్‌కు కేరాఫ్‌గా ఉండేది. కాలక్రమేణా ఉమ్మడి తూర్పులో ఎక్కడికక్కడ మార్కెట్లు పెరిగాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని సామర్లకోట, ప్రత్తిపాడు, బూరుగుపూడి, రావులపాలెం, కొత్తపేట, అమలాపురం ప్రాంతాల్లో ఉల్లి హోల్‌సేల్ మార్కెట్ పుంజుకుంది. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో కర్నూలు ఉల్లిపాయలు దాదాపుగా నిలిచిపోతాయని... పులివెందుల, మైదుకూరు రకాలు ప్రారంభమవుతాయని చెప్తున్నారు. ఈ రకాలు ఎన్ని వచ్చినా మహారాష్ట్ర ఉల్లికి డిమాండ్ తగ్గే అవకాశం లేదనే చెప్పాలి. దీంతో ధరలు కూడా దిగివచ్చే అవకాశం లేదు. అయితే ఉల్లిపాయలను 4 శాతం విదేశాలకు ఎగుమతి చేసుకోవడానికి మహారాష్ట్ర వ్యాపారులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారని, దీనివల్ల ధర కొంచెం పెరిగే అవకాశం ఉందని హోల్‌సేల్ వ్యాపారి ఒకరు చెప్పారు. ఎగుమతులు 15 శాతం అయితే ధరలు కాస్త పెరిగే అవకాశం ఉందన్నారు.

ఉపాధ్యాయ నియామక పత్రాల అందజేత కార్యక్రమం వాయిదా

కాకినాడ రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం జరగాల్సిన మెగా డీఎస్సీ-2025 నూతన ఉపాధ్యాయుల నియామక పత్రాల అందజేత కార్యక్రమాన్ని భారీ వర్షాల కారణంగా వాయిదా వేసినట్టు కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరులో భారీ వర్షాల కారణంగా అభ్యర్థుల రాకపోకలను దృష్టిలో పెట్టుకుని వాయిదా వేశారని, నిర్వహణ తేదీలను త్వరలో ప్రకటిస్తారని కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ తెలిపారు.



స్వామి, అమ్మవార్లు, ఇతర ఉపాలయాల్లో దేవతలకు అలంకరించే పట్టు వస్త్రాలు

సత్యదేవుని సన్నిధిలో దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధం

- 11 రోజులు వివిధ రూపాల్లో అమ్మవారి అలంకరణ
- రూ 2.75 లక్షలు విలువైన పట్టు వస్త్రాలు అందజేసిన దాత

అన్నవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో విశ్వావసు నామ సంవత్సర దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలకు ఆలయ యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఈ నెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు 11 రోజుల పాటు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. కనకదుర్గ, వనదుర్గ ఆలయాల్లో ప్రతి నిత్యం కుంకుమార్చనలు, సూర్యనమస్కారాలు, జపాలు, పారాయణలు, సహస్రలింగార్చన జరుగుతాయి. విజయదశమి రోజున హోమ పూర్ణాహుతితో వైదిక కార్యక్రమాలు పూర్తవనుండగా రాత్రి దేవస్థానం హైస్కూలు మైదానంలో శమీ పూజ నిర్వహిస్తారు. దీనికి సంబంధించి ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఈవో వీర్ల సుబ్బారావు ఆదేశాలు జారీ చేశారు.

శరన్నవరాత్రుల్లో స్వామి, అమ్మవార్ల మూలవరులకు, ఉపాలయాలైన యంత్రాలయం, రామాలయం, వనదుర్గ, కనకదుర్గ ఆలయాల్లో కొలువైన దేవతామూర్తుల అలంకరణకు ఒక దాత రూ.2.75 లక్షలు విలువైన పట్టు వస్త్రాలను సమర్పించారు. విజయవాడకు చెందిన రావాడ చిరంజీవిరావు దంపతులు వీటిని దేవస్థానం అధికారులకు గురువారం అందజేశారు.



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న అతిథులు గోపాలకృష్ణ, బీటీ కృష్ణ

యూఏవీల డిజైన్‌పై వర్క్‌షాప్

జేఎన్టీయూకే, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకేలోని ఐఎస్టీలో అన్‌మ్యాన్డ్ ఏరియల్ వెహికల్స్ (యూఏవీ) డిజైన్, అసంబుల్ ఫ్లైట్ ఆపరేషన్స్‌పై రెండు రోజులు నిర్వహించే వర్క్‌షాప్‌ను గురువారం ప్రారంభించారు. స్కూల్ ఆఫ్ ఏవియానిక్స్, ఐఎస్టీ, జేఎన్టీయూకే ఆధ్వర్యంలో విభాగాధిపతి ప్రొఫెసర్ కె.పద్మప్రియ అధ్యక్షతన నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌ను డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఎ.గోపాలకృష్ణ, డీఐఎస్టీ డైరెక్టర్ డాక్టర్ బీటీ కృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. యూఏవీల సాంకేతికత ప్రాధాన్యతను డాక్టర్ డోలాసం దీప్ వివరించారు. పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అండర్-17 వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు దినేష్‌ప్రసాద్ ఎంపిక



అంబాజీపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అండర్-17 వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ముక్కామల జడ్పీ హైస్కూలు 9వ తరగతి విద్యార్థి జి.దినేష్‌ప్రసాద్ ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు ఎం ఎస్ఆర్ మూర్తి తెలిపారు. కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 79 కేజీల విభాగంలో ప్రసాద్ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించడంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పీడీ ముత్యాల పవన్‌కిషోర్ తెలిపారు. ప్రసాద్‌కు ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్ బండారు వరలక్ష్మి, ఎంపీటీసీ వనచర్ల దుర్గాభవాని, ఎస్ఎంసీ ఛైర్మ న్ బి.శామ్యూల్‌రాజు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



79 కేజీల విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన దినేష్‌ప్రసాద్

22న పాదగయ పుష్కరిణిలో నీటి తొలగింపు

● పుష్కరిణి వద్ద జల్లుస్నానానికి ఏర్పాట్లు

పిఠాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని పాదగయ పుష్కరిణిలో నీటిని ఈ నెల 22న తొలగించనున్నారు. మహాలయ పక్షాలు కావడంతో దేశంలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పాదగయలో పిండప్రదానాలు చేసి వాటిని పుష్కరిణిలో కలుపుతున్నారు. దీంతో పుష్కరిణిలో నీరు కలుషితమైందని చెప్తున్నారు. ఈనెల 21వ తేదీ మహాలయ అమావాస్య వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని పాదగయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తెలిపారు. మహాలయ పక్షాలు ముగిసిన వెంటనే 22న పుష్కరిణిలో నీరు తొలగిస్తామని చెప్పారు. అక్టోబరు 2న విజయదశమి పర్వదినం సందర్భంగా పుష్కరిణిలో తెప్పోత్సవం సమయానికి మరలా కొత్త నీరు పెడతామని తెలిపారు. ఈలోగా ఆలయానికి వచ్చే భక్తులు, భవానీ మాలధారులు స్నానాలు ఆచరించేందుకు ఇబ్బందిపడకుండా ఉండేందుకు పాదగయ పుష్కరిణి తూర్పు వైపున జల్లుస్నానాలకు ఏర్పాట్లు చేసినట్టు ఈవో చెప్పారు.

శ్రీలంకలో చిక్కుకున్న మత్స్యకారులు..

వారి కుటుంబాలకు సరుకులు



సాయం చేస్తున్న ఎంపీ కార్యాలయ సిబ్బంది

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీలంకలో నిర్బంధంలో ఉన్న కాకినాడకు చెందిన నలుగురు మత్స్యకారులలో రెండు కుటుంబాలకు రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు కార్యాలయం నుంచి నిత్యవసర సరుకులను గురువారం అందజేశారు. ఈ నేపథ్యంలో రాజ్యసభ ఎంపీ సతీష్‌బాబు ఢిల్లీలో ఉన్న అధికారులతో మాట్లాడి వారి తాజా క్షేమ సమాచారం కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఈనెల 12న జాఫ్నా కాయ్స్‌కోర్టు ఈ నలుగురు మత్స్యకారులను వారి పడవతో సహా విడుదల చేయాలని, భారతదేశ సముద్రజలాల సరిహద్దు వరకు విడిచి పెట్టాలని ఆదేశించింది. ఈ మేరకు శ్రీలంక నౌకాదళాలకు ఆదేశాలు ఇచ్చింది. ఆ ఉత్తర్వులు ఈనెల 26వ తేదీలోపు అమలు చేయాలని పేర్కొంది. ఈ మొత్తం ప్రక్రియను శ్రీలంక రక్షణ మంత్రిత్వశాఖ ద్వారా పర్యవేక్షణ చేస్తూ మత్స్యకారులను వీలైనంత త్వరగా తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నారు.

సమిశ్రగూడెంలో వరుస దొంగతనాలు

నిడదవోలు, సెప్టెంబరు 18 (ఆంధ్ర జ్యోతి): నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో బుధవారం రాత్రి రెండు చోట్ల దొంగలు పడి నగదు, బంగారం దోచుకుపోయారు. డీ.కొండమ్మకు చెందిన ఇంట్లో సుమారు రూ. 80 వేల నగదు, రెండు కాసుల బంగారు వస్తువులు, రెండు జతల వెండి పట్టీలు, అలాగే కాలువగట్టుపై ఉన్న టీ షాపులో 20 వేల నగదు దోచుకు పోయారని బాధితులు సమిశ్రగూడెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్‌ఐ బాలాజీ సుందరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

బైక్ దొంగల అరెస్టు ... ఆరు వాహనాలు స్వాధీనం

కె.గంగవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కే.గంగవరం మండలంలో బైక్ చోరీలకు పాల్పడుతున్న వ్యక్తితో పాటు వాటిని కొనుగోలు చేసిన వారిని అరెస్టు చేసినట్టు పామర్రు ఎస్‌ఐ ఎస్‌కే జానీబాషా తెలిపారు. వివరాలివి. రామచంద్రపురానికి చెందిన పెమ్మిరెడ్డి బాల వెంకట్(బాల) బైక్‌లు దొంగలించి కోటిపల్లికి చెందిన కర్రి సత్యనారాయణ (నాని), గంగవరం గ్రామానికి చెందిన పెంటపాటి వీరబాబుకు విక్రయించాడు. ఈ ముగ్గురిని గురువారం అరెస్టు చేసి రామచంద్రపురం కోర్టులో హాజరుపరిచగా 14 రోజులు రిమాండ్ విధించారని తెలిపారు. స్వాధీనం చేసుకున్న బైక్‌లను వారి యజమానులకు అప్పగించడం జరుగుతుందని పేర్కొన్నారు. రామచంద్రపురం సీఐ వెంకట నారాయణ ఆధ్వర్యంలో ముద్దాయిలను పట్టుకున్న బృందాన్ని ఎస్పీ రాహుల్ మీనా, డీఎస్పీ రఘువీర్ అభినందించారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో

వీఆర్వోలకు ఉద్యోగోన్నతి కల్పించాలి



కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రమిస్తున్న వీఆర్వోల సంఘం ప్రతినిధులు

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గ్రేడ్-1, గ్రేడ్-2 గ్రామ రెవెన్యూ అధికారులకు ఉద్యోగోన్నతి కల్పించాలని వీఆర్వోల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం కాకినాడ కలెక్టరేట్లో కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ పోస్టులను గ్రేడ్-1 వీఆర్వోలతో భర్తీ చేయాలన్నారు. గ్రేడ్-2 వీఆర్వోలకు గ్రేడ్-1 వీఆర్వోలుగా ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. అనంతరం డీఆర్వో వెంకట్రావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి రామ్మోహన్‌రావును కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి అనిశెట్టి రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాడ్రేవు పద్మ, కాకినాడ డివిజన్ అధ్యక్షుడు మేడిశెట్టి కిషోర్, కోనసీమ జిల్లా అధ్యక్షుడు యల్లేశ్వరరావు, కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసు, ఇతర ప్రతినిధులు అప్పల నాయుడు, ఎండీ రాజా, శివరామ్, తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ కోసం

నిషిద్ధ ప్రాంతం గుర్తింపు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పారాదీప్ నుంచి హైదరాబాద్ వరకు నిర్మించిన ఆయిల్ పైప్ లైన్‌కు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలోని ధర్మవరంలో సర్వే నెం.723/3ఎలో 65 సెంట్ల భూమిని నిషిద్ధ ప్రాంతంగా ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు గురువారం జీవో నెం.105 జారీ చేసింది.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి

నిడదవోలు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం శెట్టిపేట గ్రామానికి చెందిన గట్టున సత్యవతి (55) అనుమానాస్పదస్థితిలో గురువారం మృతి చెందింది. మధ్యాహ్నం సత్యవతి సోదరి దేవి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. దీంతో సమీప బంధువైన కూనపురెడ్డి గంగారత్నంకు ఈ విషయం చెప్పగా... ఆమె వెళ్లి చూసేసరికి బాత్‌రూమ్ సమీపంలో రక్తపు మడుగుతో సత్యవతి పడి ఉందని దేవికి సమాచార మిచ్చింది. ఆమె వచ్చి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్‌ఐ జగన్మోహనరావు తెలిపారు. ఈమె భర్త కొంతకాలం క్రితం మృతిచెందాడు. ఒక్కరే ఇంట్లో నివసిస్తున్నారు. ఈ విషయం తెలియడంతో చుట్టుపక్కల వారు భయాందోళన చెందారు.

జంట హత్యలో కొనసాగుతున్న విచారణ

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అప్పు తీరుస్తానని రమ్మని చెప్పి ఇద్దరిని హత్య చేసి బావిలో పడవేయడమే గాక, మరొకరిపై హత్యాయత్నానికి పాల్పడిన సంఘటనపై గొల్లప్రోలు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించి అనుమానితుడిగా ఉన్న రంపం గంగాధర్‌ను ఇప్పటికే అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు గురువారం మరికొందరిని ప్రశ్నిస్తున్నారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తికి చెందిన రంపం గంగాధర్ అదే గ్రామానికి చెందిన రంపం శ్రీను, తోరాటి సూరిబాబును వారి వద్ద తీసుకున్న బాకీని తీరుస్తానని చెప్పి గ్రామశివారులోని పొలాల్లో ఉన్న బావి వద్దకు తీసుకువెళ్లి అందులో తోసివేసి హత్య చేశాడు. అలాగే కుంపట్ల సూరిబాబు (బాబ్జీ)పై హత్యాయత్నానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ సంఘటనకు సంబంధించి పలు కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు. హతులు దగ్గర నుంచి ఎంత అప్పు తీసుకున్నారు, అప్పు తీర్చమని ఒత్తిడి చేయడమే హత్యకు కారణమా, ఇంకా ఏమైనా ఉన్నాయా, వారి మధ్య ఉన్న వ్యవహారాలు, ఇతర అంశాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. ఇప్పటివరకు గంగాధర్ మాత్రమే ఈ సంఘటనకు పాల్పడ్డాడని భావిస్తుండగా, ఇందులో మరికొందరి పాత్ర ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. దీనికి అనుగుణంగా పలువురిని అదుపులోకి తీసుకున్నారు.

యానాం సబ్ జైలులో ఎన్ఐఏ తనిఖీలు

● హత్య కేసులో ప్రధాన నిందితుడిపై ఆరా

యానాం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలోని ప్రత్యేక సబ్‌జైల్‌లో చెన్నైకు చెందిన ఎన్ఐఏ అధికారుల బృందం గురువారం తెల్లవారు జామున తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీలు యానాం, పుదుచ్చేరి జైలులో ఏకకాలంలో జరిగాయి. పుదుచ్చేరి హోంమంత్రి నమశ్శివాయః బంధువు విలియనూర్ భాజపా ఇన్‌చార్జి సెంధిల్‌కుమార్ గత 2023వ సంవత్సరం మార్చి 26న రాత్రి పూట ఇంటికి వెళుతున్న సమయంలో బైక్‌లపై వచ్చి కత్తులతో నరికి, నాటుబాంబు వేసి హత్య చేశారు. ఈ సంఘటన అప్పట్లో పుదుచ్చేరి వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కాగా, హత్యలో ప్రధాన నిందితుడు నిత్యానందన్‌తో పాటు మరో 12 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈక్రమంలో నాటుబాంబులు ఉపయోగించడం, తదితర కారణల వల్ల కేసును ఎన్ఐఏకు అప్పగించడంతో విచారణ కొనసాగుతోంది. ప్రధాన నిందితుడు నిత్యానందన్‌తో పాటు మిగిలిన వారందరినీ పుదుచ్చేరిలోని కాలాపేట సెంట్రల్ జైలుకు తరలించారు. అక్కడ జైలులో నుంచే నేర కార్యక్రమాలను కొనసాగిస్తున్న నేపథ్యంలో ప్రధాన నిందితుడిని ఏప్రిల్ నెలలో యానాంకు తరలించారు. మళ్లీ ఇక్కడ కూడా నేర కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్టు ఎన్ఐఏకే సమాచారం రావడంతో చెన్నైకు చెందిన ఇద్దరు ఎన్ఐఏ అధికారుల బృందం గురువారం యానాం సబ్‌జైల్‌లో తనిఖీలు నిర్వహించారు. విషయాన్ని యానాం జైలు సూపరింటెండెంట్ డాక్టర్ టీ.రవిశంకర్ తెలిపారు.

అన్నవరంలో ..

హిజ్రాలకు కౌన్సెలింగ్

● శుభకార్యాల్లో బలవంతపు వసూళ్లకు పాల్పడితే చర్యలు



హిజ్రాలకు కౌన్సెలింగ్ ఇస్తున్న అన్నవరం ఎస్ఐ హరిబాబు

అన్నవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అన్నవరం పరిసరప్రాంతాలు, రత్నగిరి కొండపై జరిగే వివాహాది శుభకార్యక్రమాల్లో బలవంతపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని అన్నవరం ఎస్ఐ హరిబాబు హెచ్చరించారు. గురువారం గ్రామంలో ఉన్న హిజ్రాలతో సమావేశమై వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. దారి దోపిడీలు, దొంగతనాలలో హిజ్రాలు పాల్గొన్న సంఘటనలు ఉన్నాయని, పునరావృతమైతే చర్యలు తప్పవన్నారు. హిజ్రాలు సమాజంలో గౌరవంగా జీవించాలని అందుకు ప్రభుత్వపరంగా సహాయసహకారాలు అందిస్తామని, అలాగే ప్రత్యామ్నాయ అవకాశాలు అందిపుచ్చుకోవాలని ఆయన సూచించారు.

పంట కాలువలోకి

దూసుకెళ్లిన పాల వ్యాన్



యండగండి - పామర్రు రోడ్డులో దూసుకెళ్లిన వ్యాన్

కే.గంగవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కే.గంగవరం మండలంలోని పామర్రు యండగండి రహదారిలో గురువారం పంట కాలువలోకి పాలఉత్పత్తులు రవాణా చేసే వ్యాన్ దూసుకుపోయింది. తెల్లవారు జామున అంగర వైపు నుంచి పామర్రు వైపునకు వస్తున్న లారీ కుడి వైపున ఉన్న పంట కాలువలోకి దూసుకెళ్లింది. అక్కడ పొలంలో తాటిచెట్టు ఉండటంతో దానికి ఆనుకుని నిలిచిపోయింది. లేకపోతే బోల్తా పడేది. కాగా, ప్రమాదంలో ఎవరికీ దెబ్బలు తగల్లేదు. డ్రైవర్, క్లీనర్, తదితరులు సురక్షితంగా బయటపడ్డారు. అనంతరం రెండు జేసీబీల సహాయంతో లారీని పైకి తీశారు.

డీజిల్ అక్రమ వ్యాపారం గుట్టురట్టు

» యజమాని సహా డ్రైవర్‌పై కేసు

» ట్యాంకర్ సీజ్ చేసిన విజిలెన్స్ అధికారులు



డీజిల్ ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

రాజానగరం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏవిధమైన అనుమతులు లేకుండా గుట్టుచప్పుడు కాకుండా డీజిల్ వ్యాపారం సాగిస్తున్న ట్యాంకర్‌ను విజిలెన్స్ అధికారులు గురువారం దాడిచేసి పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ ఎస్.తాతారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ముందుగా అందిన సమాచారం మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లయిస్, లీగల్ మెట్రాలజీ, రవాణా శాఖాధికారులు రాజానగరం మండలం తూర్పుగోనగూడెం సమీపంలోని జిఎస్‌టీఎస్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఏపీ 39 డబ్ల్యూహెచ్ 3177 మహేంద్ర బొలేరో మినీ ట్యాంకర్ డ్రైవర్ వాహనానికి డీజిల్ కొడుతుండగా ఈ దాడి చేశామన్నారు. ట్యాంకర్ డ్రైవర్ పల్లికొండ రాజేష్ (అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం)ను పట్టుకుని బిల్లులు అడిగితే లేవని బదులిచ్చాడన్నారు. ట్యాంకర్ యజమాని రాజమహేంద్రవరానికి చెందిన మేడిశెట్టి గంగరాజు అలియాస్ రాజేష్ ఆదేశాలతో ఇక్కడ బస్సులకు డీజిల్ కొడుతున్నానని చెప్పాడన్నారు. మొత్తం 983 లీటర్ల డీజిల్ ఇక్కడ కొట్టినట్లుగా తెలుస్తోందన్నారు. ట్యాంకర్‌కు ఏవిధమైన అనుమతులు లేవని, ట్యాంకర్ పంప్‌కు కనీసం సీలు కూడా లేదన్నారు. డీజిల్ విలువ రూ.97,310లుగా అంచనా వేశామన్నారు. ఈ మేరకు ట్యాంకర్ యజమాని, డ్రైవర్‌పై 6ఏ కేసు నమోదు చేయడంతో పాటు ట్యాంకర్‌ను సీజ్ చేశామన్నారు. ఈ దాడిలో సివిల్ సప్లయిస్ అధికారి గొలుగూరి బాపిరాజు, కానిస్టేబుల్ లోవరాజు, శివ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరికి గాయాలు

గోకవరం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): శరన్నవ రాత్రి ఉత్సవాలకు విద్యుత్ అలంకరణ చేస్తున్న ఇద్దరు యువకులు గురువారం విద్యుదాఘానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. గోకవరంలోని ఆంజనేయస్వామి గుడి సెంటర్‌లో వీరభద్రుడి గద్దెలో దసరా ఉత్సవాలు నిర్వహించేందుకు లైటింగ్ పనులు చేపట్టారు. మండలంలోని కొత్తపల్లికి చెందిన పిల్లల విజయ్‌కుమార్, కోరుకొండకు చెందిన



గోకవరంలో విద్యుత్ పనులు చేస్తున్న దృశ్యం

సూరాడి వీరబాబు మరి కొంతమందితో కలిసి ఈ పనులు నిర్వహిస్తున్నారు. ప్రధాన రహదారిపై తొట్టె ఆటోపై ఇనుప స్టాండ్ వేసుకొని విజయ్‌కుమార్, వీరబాబు సీరియల్ సెట్ వైర్లు బిగిస్తుండగా 11కేవీ విద్యుత్ వైర్లు తగిలి ప్రమాదానికి గురయ్యారు. దీంతో వారిద్దరినీ స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించారు. అనంతరం వైద్యుల సూచనతో మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగానే ఉన్నట్టు సమాచారం.

16 మందికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 16 మందికి జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ 5వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్‌కే షరీన్ గురువారం తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్ 1, 2 సీఐలు ఎన్.రమేష్, డి.రామారావు తమ సిబ్బందితో బుధవారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మోతాదు దాటి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్లతో పరీక్షించగా 16 మంది పట్టుబడ్డారు. వారిని గురువారం కోర్టులో హాజరుపరచగా నలుగురికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష, మరో 12 మందికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించినట్టు సీఐ రమేష్ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ఆరుగురి అరెస్టు.. రూ.82,260 స్వాధీనం

కొత్తపేట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కొత్తపేట పాతారామాలయం ప్రాంతంలో పేకాట ఆడుతున్న సమాచారం మేరకు ఎస్ఐ జి.సురేంద్ర ఆధ్వర్యంలో బుధవారం అర్ధరాత్రి సిబ్బంది దాడి చేశారు. ఈదాడుల్లో ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.82,260 నగదును స్వాధీనం చేసుకుని, కోర్టుకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

వ్యాన్ ఢీకొని యువకుడి మృతి



పవన్‌కుమార్(ఫైల్)

ముమ్మిడివరం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెం సెంటర్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. రాజుపాలేనికి చెందిన మోటారుసైకిల్ మెకానిక్ గుబ్బల పవన్‌కుమార్(25) గురువారం పల్లిపాలెం సెంటర్‌లోని మెకానిక్ షాపు నుంచి ఇంటికి వెళుతుండగా కాకినాడ నుంచి అమలాపురం పెళ్లి బృందంతో వెళుతున్న టాటాఏస్ వ్యాన్ అతివేగంగా ఢీకొని కొంత దూరం ఈడ్చుకుపోయింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఐ.పోలవరం మండలం ఐ.పోలవరానికి చెందిన గుబ్బల శ్రీనివాసరావు-సత్యవతి దంపతులు రాజుపాలెంలో స్థిరపడ్డారు. వ్యవసాయం చేసుకుని జీవనం సాగించే శ్రీనివాసరావుకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు పవన్‌కుమార్ మోటారుసైకిల్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. పవన్ మృతితో గ్రామంలోను విషాద ఛాయలు అలుముకున్నాయి. ముమ్మిడివరం పోలీసులు కేసు నమోదుచేసి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు చేపట్టారు.

సమస్యలను రెండు నెలల్లో పరిష్కరిస్తాం

» కమలంపాలెం పర్యటనలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యులు

» పునరావాస కాలనీ ప్యాకేజీ, గృహ నిర్మాణాలపై ఆరా



సమావేశంలో మాట్లాడుతున్న మానవ హక్కుల సంఘం సభ్యులు

దేవీపట్నం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల సమస్యలను రెండు నెలల్లో పరిష్కరిస్తామని అధికారులు చెప్పారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ సభ్యులు ఇంద్రజిత్‌కుమార్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డి రంపచోడవరం పీవో స్మరణ్‌రాజ్, సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్.. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలంలోని కమలంపాలెం పునరావాస కాలనీలో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా పోలవరం నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. ముందుగా నిర్వాసితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యురాలు విజయభారతి శయని మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ అందిందా? లేదా? గృహ నిర్మాణాలు పూర్తి అయ్యాయా? భూమికి భూమి కేటాయించారా ? లేదా అనే విషయాలు తెలుసుకుని వాటికి సంబంధించి అధికారులు పూర్తిగా సహకరించాలని తెలిపారు. త్వరలోనే నిర్వాసితులకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.సత్యనారాయణ, ఎంపీడీవో కె.స్మాలన్‌రాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీరింగ్ అధికారులు, ఎస్ఐ కె.షరీఫ్ పాల్గొన్నారు.

మౌలిక వసతులపై ఫిర్యాదు

పోలవరం నిర్వాసితుల కోసం నిర్మించిన పునరావాస కాలనీల నిర్మాణంలో నాణ్యత లోపించిందని తాళ్లూరు గ్రామ నిర్వాసితులు మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. కోరుకున్న చోటే పునరావాసం కల్పించకుండా అధికారులకు నచ్చిన చోట నిర్మించారని కాలనీల నిర్మాణాలు లోతట్టు ప్రాంతంలో నిర్మించడం వల్ల ఇళ్లు ఊట తేలిపోతున్నాయన్నారు. మహిళలకు మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేదని వాపోయారు. జీవనోపాధి కోసం మైదాన ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని కోరారు. దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, కమిటీ సభ్యుడు గేదల పెద్దసుబ్బారావు.. తూర్పుగోదావరి జిల్లా గోకవరం గ్రామంలోని గంగాలమ్మ ఆలయ సమీపంలో దేవీపట్నం గ్రామానికి నిర్మించే ఆర్అండ్ఆర్ కాలనీ పూర్తికాలేదని, తొమ్మిదెకరాల విషయం కోర్టులో ఉందని తదితర సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కస్తామని అధికారులు పేర్కొన్నారు.

డ్వాక్రా రుణాల మంజూరులో వీవోఏ చేతివాటం

సామర్లకోట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పండ్రవాడ గ్రామంలో మహిళా శక్తి సంఘాలకు బ్యాంకుల ద్వారా మంజూరు చేస్తున్న రుణ పథకాలలో వెలుగు యానిమేటర్‌గా పనిచేస్తున్న ఒక మహిళ సుమారు రూ.20 లక్షల మేర రుణ మొత్తాల సొమ్ము తన స్వప్రయోజనాలకు వాడుకుని అక్రమాలకు పాల్పడడమే గాక రుణాలు పొందిన 26 సంఘాల సభ్యుల నుంచి అదనంగా మరో 24 నెలల డబ్బులు వసూలు చేసినట్టు సోమవారం కాకినాడ కలెక్టర్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో డీఆర్‌డీఏ ఏజీఎం శివకుమార్ తోపాటు సామర్లకోట వెలుగు ఏపీఎం జగదీశ్వరి పండ్రవాడ గ్రామం చేరుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నారు. గ్రామానికి చెందిన ఒక డ్వాక్రా సంఘ సభ్యురాలు చేసిన ఫిర్యాదు మేరకు ఈ విచారణ చేస్తున్నట్టు సమాచారం. పలు మహిళా సంఘాలకు మంజూరైన రుణ మొత్తాలను సదరు వీవోఏ పక్కదారి మళ్లించినట్టు ఆరో పణలు ఉన్నాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు వీఆర్‌డీఏ ఉన్నతాధికారులు దర్యాప్తునకు ఆదేశించారు. రెండు రోజులుగా పండ్రవాడ గ్రామానికి చెందిన దత్తత బ్యాంకులైన తిమ్మాపురం కార్పొరేషన్ బ్యాంకు, సామర్లకోటలోని మరో రెండు బ్యాంకులలోనూ, అచ్చంపేటకు చెందిన గోదావరి గ్రామీణ బ్యాంకులోనూ ఆరోపణలకు గురైన వీవోఏ నిర్వహించిన బ్యాంకింగ్ కార్యకలాపాలను ఆయా బ్యాంకు మేనేజర్లతో కలిసి పరిశీలించినట్టు తెలిసింది. గురువారం గ్రామంలో పలు స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులను విచారణాధికారుల బృందం స్వయంగా విచారించి నివేదికలను తయారు చేశారు. విచారణ అధికారులు ప్రాథమికంగా రూపొందించిన సమాచారం ప్రకారం సుమారు రూ.20 లక్షల మేర రుణ మొత్తాలను పక్కదారి పట్టించినట్టు అంచనా వేశారు. ఈ విషయమై వెలుగు ఏపీఎంను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు అందిన ఫిర్యాదు మేరకు డీఆర్‌డీఏ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నామని, పూర్తి నివేదిక జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తా మని స్పష్టం చేశారు.

గోప్యంగా దర్యాప్తు

భార్యను వేధిస్తున్న భర్తకు రిమాండ్

బిక్కవోలు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం కండ్రిగ గ్రామానికి చెందిన కొప్పిశెట్టి సాయిప్రసాద్‌కు ఈ ఏడాది ఏప్రిల్‌లో తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురానికి చెందిన శ్రీదేవితో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. 22 ఏళ్ల శ్రీదేవి పుట్టుకతోనే మూగ, చెవిటి. అయితే సాయిప్రసాద్‌కు ఇదివరకే విజయవాడకు చెందిన మహిళతో వివాహమైంది. వారికి ఒక పాప కూడా వుందన్నారు. ఈ విషయాన్ని దాచిపెట్టి శ్రీదేవిని రెండో వివాహం చేసుకున్నాడు.ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరిస్తూ శారీరకంగా, మానసికంగా వేధిస్తుండడంతో శ్రీదేవి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి సాయిప్రసాద్‌తో పాటు అతడి తండ్రి వానబాలుడు అరెస్టు చేశారు. కోర్టుకు తరలించగా రిమాండ్ విధిచారని ఎస్ఐ పేర్కొన్నారు.

సబ్ జైలు సందర్శన

పెద్దాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్ జైలును జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్.శ్రీలక్ష్మి గురువారం సందర్శించారు. ఖైదీల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారికి పెట్టే ఆహార పదార్థాలు, మంచినీరు, జైలు పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ రమణబాబు, అడ్వకేట్ ప్రభుజీ, పారా లీగల్ వలంటీరు డి.లక్ష్మి, జైలు సిబ్బంది పాల్గొన్నారు.


పిఠాపురం తహసీల్దారు కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న వీఆర్ఏలు


కాజులూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వీఆర్ఏలు


కొత్తపల్లిలో తహసీల్దారుకు సమస్యలు తెలియజేస్తున్న వీఆర్ఏలు

సమస్యల పరిష్కారానికి వీఆర్ఏల ఆందోళన

పిఠాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సహాయకులకు పేస్కేలు అమలు చేయాలని, నామినీలకు వీఆర్ఏలుగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ పిఠాపురం తహసీల్దారు కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. అర్హులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం గురు, శుక్ర వారాల్లో తహసీల్దారు కార్యాలయాలు, 20న ఆర్డీవో కార్యాలయాలు, 22న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని సంఘం ప్రతినిధులు తెలిపారు. ఆందోళనలో ఎస్.అప్పలస్వామి, కె.రాజారత్నం, డి.సత్తియ్య, ఎం.సూరిబాబు, వి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కాజులూరు (కరప) (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ తహసీల్దారు కార్యాలయం ఎదుట రెవెన్యూ సిబ్బంది ఆందోళన చేపట్టారు. సంఘ మండల అధ్యక్షుడు ఈశ్వరరావు మాట్లాడుతూ వీఆర్ఏలకు పేస్కే ల్ అమలుచేయాలని, అర్హులైన వీఆర్ఏలకు వీఆర్వోలుగా ఉద్యోగోన్నతి కల్పించాలని, నామినీ వీఆర్ఏలను క్రమబద్ధీకరించాలని కొన్నేళ్లుగా కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవట్లేదన్నారు. ఈ నేపథ్యంలో రెండు రోజులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ప్రభుత్వం తక్షణం స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలన్నారు. అనంతరం తహసీల్దారు రవీంద్రనాథ్ ఠాగూర్‌కు వినతిపత్రం సమర్పించారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ మండలంలోని వీఆర్ఏలు తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. పేస్కేల్, ఉద్యోగోన్నతులతో పాటు నామినీ వీఆర్ఏలకు పోస్టింగులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దారుకు అందజేశారు. ధర్నాలో వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షుడు ఎల్.వినోద్‌కుమార్, కార్యదర్శి అప్పలస్వామి, కోశాధికారి అప్పారావు, ఎం.రాంబాబు, వి.సత్తిబాబు, డి.నానిబాబు, యు.సీత, ఎం.మరియమ్మ, ఆర్.భద్రం తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్

సామర్లకోట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన పీడీఈ విధానంలో లోపాలను సరిదిద్దాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 19, 20 తేదీల్లో పెన్‌డౌన్ సమ్మె తలపెట్టినట్టు సామర్లకోట మండల దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 0.2 విధానంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో క్రయ, విక్రయదారులకు, దస్తావేజు లేఖరులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందన్నారు. ఓటీపీలు బహిర్గతం చేయడానికి ప్రజలు సంకోచిస్తున్నారన్నారు. ఆటోమ్యూటేషన్ విధానం మంచిదే కానీ శాఖాపరమైన సమన్వయ లోపంతో పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాజులూరు (కరప), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాజులూరు, కరప మండలాల్లోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ కాకినాడ డీఈ ఎన్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. గొల్లపాలెం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, ట్రీ కటింగ్ దృష్ట్యా ఉదయం 9 నుంచి 11 గంటల వరకు గొల్లపాలెం, ఆర్యవటం, మొగలిపాలెం, బందనపూడి, శలపాక, మంజేరు, టి.మామిడాడ, పెనుమళ్ల, అండ్రంగి, జగన్నాథగిరి, తనుమళ్ల, పెదపాటిగరువు, కరప మండలం కొంగోడు, పెద్దాపురప్పాడు, విజయరాయుడుపాలెం, యండమూరు, గొర్రిపూడి, కాజులూరు 11కేవీ ఫీడర్ పరిధిలోని అయితపూడి, శీల, ఒంటితాడి, తిప్పరాజుపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని డీఈభాస్కర్, ఏఈ వీర్రెడ్డి చెప్పారు.

'పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి'

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు విస్తృతంగా మొక్కలు నాటాలని బీజేపీ కాకినాడ పార్లమెంటరీ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు కోరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 75వ పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా రమణయ్యపేట శివారు గైగోలుపాడు సచివాలయం వద్ద గురువారం మొక్కలు నాటారు. బీజేపీ నాయకులు నందూరి సత్తిబాబు, రామకృష్ణ, పాలిక శివ, ధనలక్ష్మి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే పరిశీలన

కొత్తపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ డివిజనల్ పంచాయతీ అధికారి అమ్మాజీ గురువారం మండలంలో పర్యటించారు. ఉప్పాడ, కొత్తపల్లి, కుతుకుడుమిల్లి, వాకతిప్ప గ్రామ సచివాలయాల్లో ఇళ్ల వారీగా నిర్వహించిన స్వామిత్వ సర్వే వివరాలను పరిశీలించారు. గ్రామాల్లో ఇళ్లను ఎంత విస్తీర్ణంలో నిర్మించారు.... దానిలో ఎంత వరకు పోరంబోకు స్థలం ఉందో సర్వే చేసిన వివరాలను చూశారు. డీఎల్పీవో వెంట పంచాయతీల కార్యదర్శులు శ్రీనివాస్, అనంత లక్ష్మి వున్నారు.


అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ కాకినాడ జిల్లా 9వ మహాసభలో మాట్లాడుతున్న బేబీరాణి

'అంగన్వాడీలకు కనీన వేతనం రూ.26వేలు ఇవ్వాలి'

కాకినాడ సిటీ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలకు కనీన వేతనం రూ.26 వేలు చెల్లించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీరాణి డిమాండ్ చేశారు. నగరంలోని టీచర్స్ హోంలో గురువారం ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూని యన్ (సీఐటీయూ అనుబంధం) కాకినాడ జిల్లా 9వ మహాసభ జిల్లా అధ్యక్షురాలు దడాల పద్మ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన బేబీరాణి మాట్లాడుతూ అంగన్వాడీల 42 రోజుల సమ్మె సందర్భంగా కూటమి ప్రభుత్వం రాసిచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. వేతనాలు పెంచి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రూ.26వేలు వేతనం చెల్లించాలని, ఐసీడీఎస్‌ని సంస్థాగతం చేసి 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని తీర్మానించారు. అనంతరం జిల్లా అధ్యక్షురాలిగా దడాల పద్మ, ప్రధాన కార్యదర్శిగా ఎరుబండి చంద్రావతి, కోశాధికారిగా గేదెల రామలక్ష్మిలతో పాటు 30 మందితో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషుబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్, కోశాధికారి మలక రమణ, దారపురెడ్డి క్రాంతి, జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాలుడి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు రూ.2లక్షలు సాయం


చెక్కు అందజేస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం రేపూరు గ్రామానికి చెందిన 6 సంవత్సరాల గాదె ఫణీంద్రకు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ నిమిత్తం దాతల సహకారంతో శ్రీయువసేన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బొల్లం సతీష్ గురువారం రూ.2 లక్షల చెక్కు అందజేశారు. నాలుగు సంవత్సరాలుగా కిడ్నీ సమస్యతో బాధపడు తున్న బాలుడికి చికిత్స చేయిస్తున్న తల్లిదండ్రులు ఆపరేషన్ చేయించడానికి స్తోమత లేక శ్రీయువసేనను ఆశ్రయించారు. సతీష్ పిలుపుమేరకు ద్వారంపూడి వీరభద్రారెడ్డి రూ.50వేలు, సత్తి సూర్యనారాయణరెడ్డి రూ.36వేలు, సానం హరీష్ రూ.20వేలు, కోన సతీష్ రూ.20వేలు, మల్ల చంద్రశేఖర్ రూ.20వేలు, మరికొందరు నగదు అందజేశారు. కార్యక్రమంలో గూటూరు సత్యనారాయణ, సీహెచ్ దుర్గారావు, పితాని నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

'పనిచేసే నాయకులకు టీడీపీలో గుర్తింపు'


చేబ్రోలులో టీడీపీ నాయకులతో కలిసి విజయ చిహ్నం చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా నేమాల బాబీ గురువారం ఎన్నికయ్యారు, అనంతరం వారంతా భారీ ర్యాలీగా తరలివచ్చి పిఠాపురంలోని టీడీపీ కార్యాలయంలో వర్మను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ఉలవకాయల దేవేంద్రుడు, ఏఎంసీ డైరెక్టర్ కొల్లు బాబూరావు, గొల్లప్రోలు మాజీ జడ్పీటీసీ మడికి ప్రసాద్ పాల్గొన్నారు.


ఉపాధ్యాయులు, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన వారిని సన్మానిస్తున్న దృశ్యం

ఉపాధ్యాయులు, కానిస్టేబుళ్లకు సన్మానం

పిఠాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం పోటీ పరీక్షల విభాగం ద్వారా చదువుకుని ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీలో 12 మంది ఉపాధ్యాయులుగా, ఐదుగురు పోలీసు శాఖలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారిని గ్రంథాలయం ఆవరణలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. గ్రంథాలయం అధ్యక్షుడు బాదం సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి కొండేపూడి శంకరరావు, సభ్యులు వెన్నపు చక్రధరరావు, పెమ్మరాజు సత్యరామ చంద్రరావు, అల్లవరపు నగేష్, కొమ్మనాపల్లి అప్పారావు, కేవీవీఎస్ ప్రసాద్, తటవర్తి సుబ్బారావు, లింగంపల్లి రవీంద్రబాబు, గట్టి శ్రీకృష్ణదేవరాయ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోటలో ట్రాఫిక్ ఇక్కట్లు

సామర్లకోట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు నిత్యకృత్యమయ్యాయి. గురువారం ఓవర్ బ్రిడ్జిపై పెద్ద ఎత్తున వాహనాలు, కళాశాల బస్సులు గంటల తరబడి నిలిచిపోయాయి. విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ట్రాఫిక్ పద్మవ్యూహ నియంత్రణ ట్రాఫిక్ పోలీసులకు అంతుచిక్కని సమస్యగా మారింది. ట్రాఫిక్ ఇక్కట్లతో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు పెద్దాపురం ఏడీబీ రోడ్డు నుంచి కాకినాడ వెళ్లే మార్గంలో పలువురు వాహనచోదకులు ప్రయాణాలు మానుకుంటున్నారు. పోలీసు, ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులు సత్వరం స్పందించి ట్రాఫిక్ రద్దీని నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.


ఓవర్ బ్రిడ్జిపై నిలిచిపోయిన వాహనాలు


పవన్ కల్యాణ్‌కి వివాహ ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే నానాజీ

పంతం వారి పెళ్లి పిలుపు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడు సందీప్ వివాహానికి హాజరు కావాల్సిందిగా కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ని ఆహ్వానించారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల విరామ సమయంలో డిప్యూటీ సీఎం చాంబర్లో పవన్‌ని నానాజీ కలిశారు. ఈ నెల 15న విజయవాడలో జరిగే తన కుమారుడి వివాహానికి విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ ఆహ్వాన పత్రిక అందజేశారు. తప్పకుండా విచ్చేస్తానని పవన్ చెప్పినట్టు నానాజీ తెలిపారు.

వాకతిప్పలో పసరు పండుగ

కొత్తపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాకతిప్పలో గురువారం పసరు పండుగను ఘనంగా నిర్వహించారు. శెట్టిబలిజపేట వద్ద పురాతన వేపచెట్టును నూకాలమ్మ తల్లిగా భావించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సార్వా సాగు అనంతరం చేలన్నీ పచ్చగా, నిండుగా దర్శనం ఇచ్చే రోజుల్లో చేసే ఈ పండుగే పసరు పండుగ అని పెద్దలు చెప్తున్నారు. పండుగ రోజున అమ్మవారికి మేకపోతులను బలి ఇవ్వడం ఇక్కడ ఆచారంగా వస్తోందన్నారు. గ్రామస్తులు, దూర ప్రాంతాల్లో ఉన్న బంధువులను, స్నేహితులను విందు భోజనాలకు ఆహ్వానించి రోజంతా ఆనందంగా గడిపారు.

'డ్రగ్స్ రహిత సమాజాన్ని తీర్చిదిద్దాలి'

కాకినాడ క్రైం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత డ్రగ్స్ రహిత సమాజాన్ని తీర్చిదిద్దాలని ఎన్‌డీపీఎస్ సీఐ సీఐ వి.శ్రీనివాసరావు సూచించారు. ఎస్పీ బిందుమాధవ్ ఆదేశానుసారం ఎస్బీ డీఎస్పీ కేవీవీ సత్యనారాయణ పర్యవేక్షణలో గురువారం ఆయన కాకినాడ ఎంఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో 'డ్రగ్స్ వద్దు బ్రో' నినాదంతో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు డ్రగ్స్ బారిన పడితే కలిగే నష్టాలను, డ్రగ్స్‌కు అలవాటుపడకుండా ఉండేందుకు పాటించాల్సిన నియమాలను సీఐ వివరించారు. ఆపరేషన్ సేఫ్ క్యాంపస్, ఆపరేషన్ గరుడ, ఆపరేషన్ ఈగల్ గురించి తెలియజేశారు. డ్రగ్స్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు. సదస్సులో వన్‌టౌన్ ఎస్ఐ స్వామినాయుడు, ప్రిన్సిపాల్, అధిక సంఖ్యలో విద్యార్థులు, ఎన్‌డీపీఎస్ టీమ్ సభ్యులు, వన్‌టౌన్ పోలీసులు పాల్గొన్నారు.

'పెండింగు వేతనాలు చెల్లించాలి'

కరప, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెండింగు వేతనాలను వెంటనే చెల్లించాలని కరప మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి శ్రామికులు గురువారం డిమాండ్ చేశారు. సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టేకుమూడి ఈశ్వరరావు, కమిడి సత్యశ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంలో 15 రోజులకే వేతనాలు చెల్లించాలని నిబంధన ఉందని, కానీ మూడు నెలలు గడుస్తున్నా పూర్తిస్థాయిలో వేతనాలు చెల్లించట్లేదని ఆరోపించారు. ఎండనక, వాననక కష్టపడి పనిచేస్తున్న ఉపాధి శ్రామికులకు గతంలో ఉన్న అన్ని సదుపాయలను తొలగించారని, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.307 వేతనం అందట్లేదన్నారు.

సత్య దత్త వ్రతాలు

పిఠాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో గురువారం సామూహిక సత్య దత్త వ్రతాలు వైభవంగా జరిగాయి. శ్రీపాద శ్రీవల్లభులకు అభిషేకాలు, గోపూజ, పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం శ్రీపాదశ్రీవల్లభుడు, నృసింహ సరస్వతి, దత్తాత్రేయ స్వాములను పుష్పాలతో అలంకరించారు. ఈవో సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.


జేసీ రాహుల్‌మీనాకు ప్రాజెక్టు రిపోర్టు అందజేస్తున్న సునీల్‌కుమార్, డీసీల చైర్మన్లు

భూగర్భ జలాల పెంపునకు నూతన ప్రాజెక్టు

పిఠాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ద్వారా కాలువల నిర్వహణే కాకుండా చెరువుల్లో నీరు నింపి భూగర్భ జలాలు పెంచేందుకు గోదావరి ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఒక నూతన ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సూచనలకు అనుగుణంగా తయారుచేసిన ఈ ప్రాజెక్టు రిపోర్టును గురువారం జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనాకు సునీల్‌కుమార్, ఇతర నీటి సంఘాల ప్రతినిధులు అందజేశారు. ఈ నూతన పద్ధతిలో భూగర్భ జలాలు గణనీయంగా పెరుగుతాయని సునీల్‌కుమార్ తెలిపారు. జేసీని కలిసిన వారిలో ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు సానా శ్రీనివాస్ (పెద్దాడ), లాకాని కృష్ణచైతన్య (కాజులూరు), పుణ్యమంతుల సత్యనారాయణ (కరప), సుబ్రహ్మణ్యేశ్వర చౌదరి (ఎర్రపోతవరం) వున్నారు.

'సమన్వయకర్తలుగా పని చేయాలి'


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీరమణి

పెద్దాపురం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో ఉన్న బంగారు కుటుంబాలకు, వారిని దత్తత తీసుకునే మార్గదర్శులకు మధ్య సచివాలయ సిబ్బంది సమన్వయకర్తలుగా వ్యవహరించాలని ఆర్డీవో కె.శ్రీరమణి కోరారు. ఆర్డీవో కార్యాలయంలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి పీ4 అమలు తీరుపై గురువారం నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడారు. సచివాలయాల పరిధిలో బంగారు కుటుంబాలను క్లస్టర్లుగా విభజించి మ్యాపింగ్ చేయాలన్నారు. ఉద్యోగులు తమకు కేటాయించిన క్లస్టర్ల పరిధిలోని బంగారు కుటుంబాలను సమన్వయం చేసుకోవాలన్నారు. ఒక్కో సచివాలయ ఉద్యోగికి కనీసం మూడు క్లస్టర్లు కేటాయించే అవకాశం ఉందన్నారు. మార్గదర్శి, బంగారు కుటుంబాల మధ్య సమన్వయం ఉండాలన్నారు. సిబ్బంది తమకు కేటాయించిన కుటుంబాలను వారానికి కనీసం ఒక్కసారైనా సంప్రదించాలని, మార్గదర్శుల నుంచి అవసరమైన సహకారాన్ని బంగారు కుటుంబాలకు అందించేందుకు కృషి చేయాలన్నారు. బంగారు కుటుంబాల సమస్యలను మార్గదర్శులకు తెలియజేసి అవసరమైనప్పుడు వారికి సహకరించాలన్నారు. బంగారు కుటుంబాలు, మార్గదర్శులు మధ్య వ్యవహారాలను పీ4 పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు.

కాకినాడ జిల్లాకు పిఠాపురం మహారాజా పేరు పెట్టాలి

ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి



కాకినాడ రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కాకినాడ జిల్లాకు పిఠాపురం మహారాజా పేరు పెట్టాలని ప్రభుత్వానికి ఆదిత్య యూనివర్శిటీ చాన్సలర్, ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి సూచించారు. జిల్లాకు పిఠాపురం మహారాజా చేసిన సేవలను ఆయన గుర్తు చేశారు. తెలుగు భాషకు చిరస్మరణీయమైన రచనలు అందించి గొప్ప సంస్కరణవాదిగా తెలుగు ప్రజలకు ఎనలేని సేవలు చేసిన మహనీయుడు పిఠాపురం మహారాజా అన్నారు. ఆయన సంఘ సంస్కరణకు, విద్యాభివృద్ధికి, దళిత జనోద్ధరణకు విశేషంగా కృషి చేశారన్నారు. సూర్యరాయాంధ్ర నిఘంటువు తయారు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. కవులను, రచయితలను శ్రీకృష్ణదేవరాయలు తర్వాత అదేస్థాయిలో ఆదరించారన్నారు. ఆదిత్య విద్యాసంస్థలు, పిఠాపురం మహారాజా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిఏటా అక్టోబరు 5న పిఠాపురం మహారాజా జయంతి సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జాతీయ స్థాయి కథ, కవితా సంపుటాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తున్నామని చెప్పారు.

పాఠశాలలో స్వచ్ఛాంధ్ర సదుపాయాల పరిశీలన

సామర్లకోట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్టేట్ టీమ్ ప్రతినిధి షెహన్‌షా గురువారం ఆకస్మికంగా సందర్శించారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా పాఠశాలలో బాలబాలికల టాయిలెట్స్ నిర్వహణ, తాగునీటి సదుపాయం, వాషింగ్ స్టేషన్స్ విత్ సోప్, చెత్త సేకరణకు రెండు డబ్బాల అమలు, రొటీన్ శానిటేషన్ అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్, ఒకేషనల్ ల్యాబ్‌లను పరిశీలించారు. ఎంఈవో పట్టపగలు పుల్లయ్య, హెచ్ఎం కూర్మారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సామర్లకోట పట్టణంలోని అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్వాడాలో భాగంగా విద్యార్థులకు జల సంరక్షణ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


మోడల్స్ ప్రదర్శిస్తున్న రైతులు

కొత్తపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయ సాగుపై అవగాహన పెంపొందించుకోవాలని ప్రకృతి వ్యవసాయం కొత్తపల్లి మండల ఇన్చార్జి ఇలపర్తి సుబ్రహ్మణ్యం విజ్ఞప్తి చేశారు. మండలంలోని గోర్సలో గంధం శ్రీనివాసు ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో 20 సెంట్ల విస్తీర్ణంలో గురువారం ప్రకృతి వ్యవసాయ మోడల్స్ ప్రదర్శించారు. కాకినాడ, అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నుంచి విచ్చేసిన బీఆర్‌సీ యజమానులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఎటువంటి క్రిమిసంహారక మందులు, ఎరువులు వినియోగించమని రైతులతో ప్రతిజ్ఞ చేయించారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన

కిర్లంపూడి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింహాద్రిపురం గ్రామంలో చిరుధాన్యాల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎఫ్‌టీసీ ఏడీఏ మాలకొండయ్య మాట్లాడుతూ చిరుధాన్యాలు సాగు చేయడంవలన కలిగే ప్రయోజనాలు వివరించారు. ఎఫ్‌టీసీ సంజయ్ మాట్లాడుతూ ఏ సమయంలో చిరుధాన్యాలు సాగు చేయాలని, దానివల్ల కలిగే ఆరోగ్య లాభాలు తెలిపారు. కార్యక్రమంలో ఏవో సుధామాధురి, ఏఈవో, వీఏఏలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

బాల్యవివాహాల నిర్మూలనకు కమిటీలు

● మధ్యలో విద్య ఆపేయడం వల్లే బాల్యవివాహాలు

● జిల్లా శిశు సంక్షేమ శాఖ పీడీ ఝాన్సీరాం పడాల్



రాజవొమ్మంగి సచివాలయం వద్ద బాలింతలు, గర్భిణులతో మాట్లడుతున్న పీడీ

రాజవొమ్మంగి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పాఠశాలవిద్య మధ్యలో ఆపేయడం వల్లే ఎక్కువగా బాల్యవివాహాలు జరుగుతున్నాయని అల్లూరి జిల్లా శిశు సంక్షేమశాఖ పీడీ ఝాన్సీ రాం పడాల్ అన్నారు. రాజవొమ్మంగి మండలంలో గురువారం ఆమె పర్యటించారు. రాజవొమ్మంగి సచివాలయంలో జరిగిన పోషణ్ మహా కార్యక్రమానికి పీడీ హాజరయ్యారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. రాజవొమ్మంగి పంచాయతీలోని అప్పలరాజుపేట, బూరుగుపల్లి, వయ్యాడ,శ్రీరాంనగర్, ముర్లవానిపాలెం అంగన్‌వాడీ సెంటర్లకు భవనాలు నిర్మించాలంటూ సర్పంచ్ గొల్లపూడి రమణి వినతిపత్రం అందించారు. రాజవొమ్మంగి ఐసీడీఎస్ కార్యాలయాన్ని పీడీ తనిఖీ చేశారు. అనంతరం పాత్రికేయులతో మాట్లడుతూ ఇటీవల బాల్యవివాహాలు జరిగిన వారిలో 247మంది గర్భిణులుగా ఉండడం గుర్తించామన్నారు. వారంతా పాఠశాల విద్య మధ్యలో ఆపివేసినవారేనన్నారు. గ్రామస్థాయిలో ప్రత్యేక కమిటీలు వేసి ప్రతి శుక్రవారం ప్రత్యేక సమావేశాలు నిర్వహణ చేయనున్నామన్నారు. శిశు మరణాల నివారణలో భాగంగా మహిళలు గర్భం దాల్చిన వెంటనే సమీప అంగన్‌వాడీ కేంద్రంలో పేరు నమోదు చేయించుకోవాలని తెలిపారు. రాజవొమ్మంగి సీడీపీవో సుజాత, లబ్బర్తి ఎంపీటీసీ గొల్లపూడి పెద్దిరాజు, ఏఎంసీ చైర్మన్ లోతా లక్ష్మణరావు ఉన్నారు.

రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం



మాట్లాడుతున్న సీడీపీవో ఉమా

దేవీపట్నం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరుపేట స్త్రీశక్తి భవనంలో గురువారం రంపచోడవరం ఐసీడీఎస్ సీడీపీవో కె.ఉమా, మండల పరిషత్ ఏవో ఎం.వెంకటేశ్వరరావు, వెలుగు ఏపీఎం రాధా అపర్ణ, ఎంపీహెచ్ఈవో కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసం సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీవో ఉమా మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు పిల్లల పోషణ విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భిణీలు, బాలింతలు, చంటిపిల్లలకు ఇచ్చే ఆహారంలో మెనూ ప్రకారం ఖచ్చితంగా అందించాలన్నారు. పిల్లలకు ఇచ్చే ఆహారంలో అవకతవకలకు పాల్పడితే తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. బాల్య వివాహాలు పూర్తి నియంత్రించే బాధ్యత తీసుకోవాలన్నారు. అంగన్వాడీ సూపర్‌వైజర్లు కారం అమ్మాజీ, వెంకటలక్ష్మి, యాట్ల రామలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

షెడ్యూల్ ప్రాంత ఉద్యోగాల

నియామకాల చట్టం ప్రకటించాలి

దేవీపట్నం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించి తక్షణమే ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించాలని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఏపీ సీఎం ఎన్నికల ముందు ఆదివాసీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీని అమలుచేయాలని, షెడ్యూల్డ్ ప్రాంతంలో ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన 5వ, షెడ్యూల్డ్ భూభాగంలో ఆదివాసీల హక్కులు, చట్టాలు, ఉద్యోగ, ఉపాధి, అభివృద్ధి సంక్షేమం పటిష్టంగా అమలు చేయాలన్నారు. తమ హక్కులు, చట్టాలు అమలుచేయని పక్షంలో భవిష్యత్‌లో ఓటు బ్యాంక్‌తో తగిన గుణపాఠం చెపుతామని హెచ్చరించారు.

'సమస్యలను పరిష్కరించండి'



ఆందోళన చేస్తున్న దృశ్యం

మోతుగూడెం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జెన్‌కోలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని తెలుగునాడు విద్యుత్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం లోయర్ సీలేరు చీఫ్ ఇంజనీర్‌కు గురువారం వినతిపత్రం ఇచ్చింది. జెన్‌కోలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి సంస్థ నేరుగా వేతనాలు చెల్లించాలని కోరింది. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. పీఆర్సీ ప్రకారం పెరిగిన జీతాలను 2022, ఏప్రిల్ నుంచి 2023, ఆగస్టు 13 వరకు బకాయిలు ఇప్పించాలని నేతలు కోరారు. డిమాండ్ల సాధన కోసం ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. 25వతేదీ లోపు సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్తామని ప్రకటించారు. కార్యక్రమంలో సంఘ నేతలు పాసి సతీష్‌బాబు, మడకం సుశీల, దొడ్డి మల్లేశ్వరరావు ఉన్నారు.

రేపు ప్రత్యేక వైద్య శిబిరాలు

చింతూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): చింతూరు ఏరియా ఆస్పత్రిలో అక్టోబరు 2 వరకు స్వస్థనారీ-స్వశక్త్ పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ఏరియా ఆస్పత్రి సూపరిటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి తెలిపారు. ఈనెల 20న ప్రత్యేక వైద్యనిపుణులతో వైద్యపరీక్షల శిబిరం నిర్వహించనున్నట్టు ఆయన చెప్పారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శిబిరంలో ఆప్తమాలజీ, ఈఎన్టీ, పీడియాట్రిషన్, జనరల్ సర్జన్‌లు పాల్గొననున్నట్లు తెలిపారు. అదే దశలో కిడ్నీ, లివర్, హిమోగ్లోబిన్ తదితర వ్యాధులకు చెందిన స్క్రీనింగ్ చేయనున్నట్లు తెలిపారు.

హైవేపై వాహనాలు పార్క్ చేస్తే కఠినచర్యలు

రాజవొమ్మంగి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగిలో జాతీయ రహదారిపై వాహనాలు పార్క్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాజవొమ్మంగి ఎస్ఐ శివకుమార్ అన్నారు. రాజవొమ్మంగిలో ర్యాష్ డ్రైవింగ్, జాతీయ రహదారిపై వాహనాలు పార్కింగ్‌పై ఎస్ఐ గురువారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు.

నేడు సీహెచ్‌సీలో మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరం

వై.రామవరం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): వై.రామవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో నేడు మహిళలకు ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చైతన్య తెలిపారు. స్వస్థ నారి సశక్త పరివార్ అభియాన్‌లో భాగంగా మహిళల ఆరోగ్యంపై దృష్టి సారించి వారికి పలు రకాల వైద్య నిపుణులచే ఉచిత వైద్య సేవలుందించడం జరుగుతుందన్నారు. ఈ సేవలను ప్రతీమహిళ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం

● ఐటీడీపీ సమావేశంలో యనమల రామకృష్ణుడు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న యనమల రామకృష్ణుడు

తునిరూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక ఎన్నికల్లో యువతకు, మహిళలకు ప్రాధాన్యం ఉంటుందని టీడీపీ సీనియర్ నేత, పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన ఐటీడీపీ సభ్యులు, యువత విభాగ సభ్యులు, గ్రామ కమిటీలు, స్టూడెంట్ ఫెడరేషన్, పార్టీ సోషల్ మీడియా సభ్యులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో యువతను ప్రోత్సహించడంతోపాటు గెలుపు గుర్రాలకు అవకాశం ఇచ్చే దిశగా చర్యలు చేపడతామన్నారు. పార్టీ ఆదేశాల మేరకు ఆ సమయంలో ఏ పార్టీ సభ్యులను ఎంపిక చేయాలన్న దానిపై నిర్ణయం ఉంటుందన్నారు. పార్టీ నిర్ణయానికి లోబడి ఒకేమాట, ఒకే బాటగా స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. తుని నియోజకవర్గంలో రూ.500కోట్ల పైబడి నిధులు ఖర్చు చేశామని, నియోజకవర్గ వ్యాప్తంగా పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ప్రతిపక్షం బాధ్యత లేనిదిగా అభివర్ణించిన ఆయన అందుకే ప్రజలు జగన్‌కు తగిన గుణపాఠం చెప్పారన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్, చింతమనీడి అబ్బాయి, పోతల సూరిబాబు, చొక్కా అప్పారావు, కుసుమంచి శోభారాణి, యినిగంటి సత్యనారాయణ, సుర్ల లోవరాజు, కాలిబోయిన గంగారావు, మడికిఉదయభాస్కర్, తమరాన సత్యనారాయణ ఉన్నారు. టీడీపీలో తొండంగి మండలం యల్లయ్యపేటకు చెందిన 200 మంది వైసీపీ కార్యకర్తలు యనమల సమక్షంలో టీడీపీలో చేరారు.

'మహిళల ఆరోగ్యమే కుటుంబానికి బలం'

● స్వస్థ నారి-సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం



యల్లమిల్లిలో స్వస్త్ నారి-స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

గండేపల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యమే కుటుంబానికి బలమని యల్లమిల్లి టీడీపీ గ్రామ అధ్యక్షుడు సుంకవిల్లి వీరవెంకటసత్యనారాయణ(సీఎం) అన్నారు. యల్లమిల్లిలో గురువారం సూరంపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్వస్థ నారి-సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకవిల్లి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమం మహిళలకు ఎంతో ఉపయోగకరమన్నారు. వైద్యసిబ్బందికి భోజనఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు హరిత, సింధు, వై.శ్రీనివాసరావు, టి.శ్రీదేవి, ప్రకాష్, రవి, దినేష్, కిషోర్ రోజా, రమేష్, ఉష, సర్పంచ్ నూకరత్తు నాగజ్యోతి ఉన్నారు.

గెద్దనాపల్లిలో వైద్యశిబిరం

కిర్లంపూడి(ఆంధ్రజ్యోతి): మండలంలోని గెద్దనాపల్లిలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం స్వస్త్ నారి-స్వశక్తి పరివార్ అభియాన్ ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. దీనికి హాజరైన మాజీ సర్పంచ్ సూరిశెట్టి వెంకటశివ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం కుటుంబానికి బలం, సమాజాభివృద్ధికి పునాది అన్నారు. వైద్యులు పలువురు మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ప్రత్తిపాడు(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.జగన్నాధపురం గ్రామంలో గురువారం స్వస్థ నారి.. సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు వైద్య శిబిరాలు నిర్వహించారు. రాచపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఉషశ్రీమహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే కంటి వైద్య నిపుణుడు డాక్టర్ నరసింహారావు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తటవర్తి సుబ్బారావు, ఉప సర్పంచ్ జి.వీరబాబు, హెల్త్ అసిస్టెంట్‌లు కుమారి, చంద్రరావు, అప్పారావు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు. బవురువాక గ్రామంలో శాంతి ఆశ్రమ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మురళీమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 60 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందు లు పంపిణీ చేశారు.

కిర్లంపూడి(ఆంధ్రజ్యోతి): మండలంలోని గెద్దనాపల్లిలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం స్వస్త్ నారి స్వశక్తి పరివార్ అభియాన్ ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ సర్పంచ్ సూరిశెట్టి వెంకటశివ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం కుటుంబానికి బలం, సమాజాభివృద్ధికి పునాది అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమం మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వైద్యులు పలువురు మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఏలేశ్వరం(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని వైద్యులు పవన్‌కుమార్ సూచించారు. గురువారం మండలంలోని జె.అన్నవరం గ్రామంలో స్వస్థ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భవతులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం, జాగ్రత్తలు వివరించారు. వైద్యులు సంతోష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సూర్యకుమారి, అంగన్ వాడీ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బవురువాకలో వైద్యశిబిరం నిర్వహించిన శాంతి ఆశ్రమ పీహెచ్‌సీ వైద్యాధికారి

తుని మున్సిపాల్టీకి..

నిధులు విడుదల చేయాలి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే దివ్య గళం



తుని రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో ప్రజారోగ్యంపై ఎమ్మెల్యే యనమల దివ్య గళమెత్తారు. అమృత్ 2.0పథకం కింద తుని మున్సిపాల్టీకి కేటాయించిన రూ.15.04కోట్ల నిధులు సత్వరం వినియోగంలోకి తీసుకురావాలని ఆమె విజ్ఞప్తి చేశారు. పట్టణ పరిధిలో 5వేల కుటుంబాలకు ఇంటింటికీ మంచినీటి సరఫరా లక్ష్యంగా ఆమె గళం వినిపించారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఈ స్కీమ్ అమల్లో జాప్యం జరిగిందన్నారు. తుని మున్సిపాల్టీ పరిధిలో 23కిలోమీటర్ల మేర పైపులైన్‌లు వేసి నీరు అందిస్తున్నారని ఆమె తెలిపారు. ఈ స్కీమ్ అమలైతే తుని పట్టణంలో ఉప్పరగూడెం, తుని మున్సిపాల్టీ శివారు ప్రాంతాలు, ఎస్.అన్నవరం శివారు ప్రాంతాలవారికి తాగునీరు సరఫరా అయ్యే అవకాశం ఉందన్నారు. దీనికి మున్సిపల్‌శాఖా మంత్రి సానుకూలంగా స్పందించి వెంటనే అమలు చేస్తామని హామీఇచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గంపేట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పెద్దాపురం-జగ్గంపేట 33కేవీ ఫీడర్‌లో కాట్రేవులపల్లివద్ద మరమ్మతుల కారణంగా 20వతేదీ శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని విద్యుత్ ఏఈ వీరభద్రరావు తెలిపారు. కాట్రావులపల్లి, సూరంపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులంతా ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

● డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్

ప్రత్తిపాడు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్యఘర్‌పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ జి.శ్రీనివాస్ కోరారు. ప్రత్తిపాడులోని సూర్యఘర్ లబ్ధిదారులు ఏర్పాటు చేసుకున్న సోలార్ ప్యానెల విద్యుత్ ఉత్పత్తిని గురువారం పీడీ శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ సూర్యఘర్ పథకంలో ప్రభుత్వం రూ.1.75 యూనిట్ విలువలో రూ.75వేలు రాయితీ మంజూరు చేస్తుందని తెలిపారు. అనంతరం ఒమ్మంగి గ్రామంలో ఎస్సీ, ఎస్టీలకు మంజూరు చేసిన ఉన్నతి పథక రుణాల రికవరీపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. తీసుకున్న రుణాలను వెంటనే చెల్లించే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో డీపీఎం కేశవ, ఏపీఎం బి.శ్రీనివాసరావు, అడ్మిన్ అసిస్టెంట్ లు బాషా, రామకృష్ణ, సీసీలు వెంకట్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధనలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రత్తిపాడు, ధర్మవరం, ఒమ్మంగి గ్రామాల్లోని వినాయక మండపాల వద్ద గురువారం భారీ అన్నదానాలు నిర్వహించారు. వినాయక ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ అన్నదాన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



కత్తిపూడిలో గర్భిణుల వివరాలు అడుగుతున్న అధికారులు

లబ్ధిదారులకు ప్రభుత్వ ఫలాలు అందాలి

శంఖవరం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు ప్రభుత్వ సేవలు అందాలని వైద్యశాఖ టాస్క్‌ఫోర్స్ టి.నీలవేణి అన్నారు. గురువారం కత్తిపూడిలో సచివాలయాల పరిధిలో గర్భిణులు, బాలింతలను కలిసి వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జి.మహేశ్వరావు, ఆయుష్మాన్ ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సస్య రక్షణ చేపట్టాలి

శంఖవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వరిలో సమగ్ర సస్య రక్షణ చేపట్టాలని వ్యవసాయ అధికారి పి.గాంధీ పేర్కొన్నారు. గురువారం ఆరెంపూడిలో రైతులకు పొలంబడి నిర్వహించారు. అనంతరం నానో యూరియాపై అవగాహన కల్పించారు. ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాస్, రైతులు, మహిళలు పాల్గొన్నారు.



దేవాన్ష్ నాయుదుని అభినందిస్తున్న విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు

జాతీయ యోగా పోటీల్లో 'శ్రీప్రకాష్' విద్యార్థికి పతకం

తుని రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): తమ విద్యా సంస్థల్లో 9వ తరగతి విద్యార్థి బండారు దేవాన్ష్‌నాయుడు జాతీయ స్థాయి అండర్-17 వ్యక్తిగత యోగా పోటీల్లో ద్వితీయస్థానంలో రజత పతకం సాధించాడని శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. ఈనెల 13 నుంచి 16 వరకు హర్యానా రాష్ట్రం కర్నాల్ పట్టణంలో జరిగిన జాతీయస్థాయి యోగా పోటీల్లో తమ విద్యార్థి ఘనత సాధించాడన్నారు. విద్యార్థిని విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, వైస్ ప్రిన్సిపల్ ఎం.అపర్ణ, యోగా గురువు సురేష్ అభినందించారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

ఏలేశ్వరం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) :ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో బాధ్యతలు స్వీకరించిన సూపరింటెండెంట్ రమేష్‌ను బీజేపీ శ్రేణులు శాలువా కప్పి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో గట్టెం వెంకట రమణ, సాయి కుమార్, వర్మ, రెడ్డి రాజు, ఏనుగు ధర్మరాజు, కర్రి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి'



ఆందోళన చేస్తున్న వీఆర్‌ఏలు

జగ్గంపేట, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ వీఆర్‌ఏల సమస్యలపై ఆందోళన, పోరాట కార్యక్రమాల కార్యాచరణను నిర్ణయించింది. గురు, శుక్రవారాల్లో తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాల చేయనున్న నేపథ్యంలో గురువారం ధర్నా చేశారు. 20న ఆర్డీవో కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం ఇవ్వాలని, 22న కలెక్టరేట్ల వద్ద ధర్నా నిర్వహించాలని, వీఆర్‌ఏలంతా పాల్గొనాలని తెలిపారు. జగ్గంపేట మండల వీఆర్‌ఏల సంఘం ప్రెసిడెంట్ కె.ఇస్సాకు, సెక్రటరీ వెంకటమౌళి, ఎస్.సోములు, కె.అప్పారావు, గోవిందరాజులు, అర్జునుడు, అప్పన్న, ప్రభావతి, చిట్టిబాబు, నవీన్‌కుమార్, సత్యవతి పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో..

ప్రత్తిపాడు, (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులోని కళామందిర్ సెంటర్ వద్ద గురువారం మండల వీఆర్‌ఏలు శిబిరం ఏర్పాటు చేసుకుని ధర్నా నిర్వహించారు. వీఆర్‌ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, పదోన్నతి కల్పించాలని, వాచ్‌మెన్, డ్రైవర్లుగా అవకాశాలు కల్పించాలని నామినీ వీఆర్‌ఏలను క్రమబద్ధీకరించాలన్నారు. ఈ ఆందోళనలో మండల వీఆర్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు, రాయవరంలలో ఐసీడీఎస్ సమావేశాలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏలూరు, టి.రాయవరంలో ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పౌష్టికాహార గురువారం మాసోత్సవ సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీవో పీబీఆర్ పద్మావతి తల్లులు, బాలింతలు, చిన్నారులకు ఎటువంటి పౌష్టికాహారం అందించాలనే అంశాలపై వివరించారు. పిల్లలకు ఆహారపు అలవాట్లు, బాల్యదశ సంరక్షణ, విద్య, తదితర అంశాలపై తీసుకోవాల్సిన చర్యలు పద్మావతి వివరించారు. యుజేపురం, పాండవులపాలెంలో కూడా నిర్వహించిన పౌష్టికాహార సమావేశాల్లో సీడీపీవో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో సర్పంచ్ తటవర్తి సుబ్బారావు, ఉపసర్పంచ్ జి.వీరబాబు, సూపర్‌వైజర్ ఎస్.వరలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది ఎం.పరంజ్యోతి, ఎస్‌వీ పద్మావతి, వీరలక్ష్మి, భాగ్యలక్ష్మి, కేఎస్ పద్మావతి పాల్గొన్నారు.

మ్యాజిక్ డ్రైన్ నిర్మాణ పనుల పరిశీలన

గండేపల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగరంపాలెంలో జరుగుతున్న మ్యాజిక్ డ్రైన్ నిర్మాణ పనులను జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ అడపా వెంకటలక్ష్మి, ప్రాజెక్టు మేనేజర్ బి.విజయ్‌భాస్కర్ గురువారం పరిశీలించారు. స్థానిక అధికారులు, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి కె.చంద్రరావు, ఏపీవో ఎం.రామకృష్ణంరాజు, క్వాలిటీ కంట్రోల్ జి.శ్వేత, ఈసీ రమేష్ ఉన్నారు.

పోషక విలువలపై అవగాహన

ప్రత్తిపాడు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులోని రెడ్నం రామ్మూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు పలు రకాల ఆహార పదార్థాలతోపాటు రాగి, మిల్లెట్ ఆహార పదార్థాలు, పోషక విలువలపై మండల వ్యవసాయాధికారి జోకా అమృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆహార పదార్థాల్లో పోషక విలువలు, వాటి ఉపయోగాలను ఏవో అమృత విద్యార్థులకు వివరించారు. ఈ సమావేశంలో హైస్కూల్ హెచ్ఎం సీహెచ్ జాన్‌ప్రసాద్, ఉపాధ్యాయులు ఎస్‌వీ సూర్యనారాయణ, వెంకటరమణ, ప్రసాద్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

ఏలేశ్వరం,సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని రమణయ్యపేట -జె.అన్నవరం ప్రధాన రహదారి పనులను ఆర్‌అండ్‌బీ అధికారులు గురువారం పరిశీలించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల ప్రకారం అధికారులు రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించారు. పదమూడు కిలోమీటర్ల మేర మరమ్మతులు చేపట్టిన పనులను ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ తదితరులు పరిశీలించి, ప్రజలకు ఇబ్బంది లేకుండా శరవేగంగా పనులు పూర్తి చేయాలని స్థానిక అధికారులకు సూచించారు.